విద్యార్థులకు చట్టాల అవగాహన

నవ తెలంగాణ కంది



జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు ఆదేశాల ప్రకారం బుధవారం మండలంలోని కాశీపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హనుమంతరావు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. న్యాయ సహాయం కోసం సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కాశీపూర్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కల పట్టివేత

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని ఆరెపల్లి గ్రామ చంద్రనాయక్ తండా బానోతు కోమలి ఇంటి ఆవరణలో 26 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు. బుధవారం చంద్రనాయక్‌తండాలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన సోదాలలో మహిళ ఇంటి ఆవరణలో 26 గంజాయి మొక్కలతో పాటు 240 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. ఆమె మనుమడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్, ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. వారివెంట కానిస్టేబుల్, సిబ్బంది ఉన్నారు.

మల్లన్నసాగర్ ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తాం

నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్



మల్లనసాగర్ ముంపు గ్రామాల ప్రజలు నివసిస్తున్న గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విధంగా పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగం, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు ఎర్రవల్లి, సింగారం, ఏటిగడ్డ కిష్టాపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహాడ్, వేముల గట్టు, కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాలు మామిడాల, బైలంపూర్, తానెదార్ పల్లెవారీగా ఆర్ అండ్ ఆర్ కాలనీలలో గ్రామపంచాయతీ ఎలక్షన్స్‌లోపు విలేజ్ మ్యాప్ తయారు చేయాలన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌలిక వసతుల కల్పన, ఓపెన్ ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ సైతం పూర్తి చేయాలన్నారు. డిపార్ట్మెంట్‌వారీగా ఏమైనా బకాయిలు ఉంటే నోట్ తయారీ చేసి ఉన్నతాధికారులకు పంపాలని తెలిపారు. సమావేశంలో సిద్దిపేట గజ్వేల్ ఆర్డీవోలు రమేష్ బాబు, బన్సీలాల్, విద్యుత్ శాఖ ఎస్ఇ మహేష్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



పోలీసులు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సీపీ ఆఫీస్ లోని డిజిటల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆయన ఆధ్వర్యంలో పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టం వర్షన్ సిసిటిఎన్ఎస్ 2.0 నూతన వర్షన్‌పై పోలీస్ అధికారులకు, సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షన్ 2.0 నూతన టెక్నాలజీతో కూడుకున్నదని, ఒకసారి పిటీషన్ మేనేజ్మెంట్లో పిటీషన్ యొక్క వివరాలు పొందుపరిస్తే ఎఫ్ఐఆర్ నుండి 7 ఇంటిగ్రేటెడ్ ఫార్మ్ వరకు సిస్టం ఆటోమెటిగ్గా జనరేట్ చేసుకుంటుందని, దీనివల్ల పని భారం తగ్గుతుంది, సమయం ఆదా అవుతుందన్నారు. వర్షన్ 2.0 గురించి విడతలవారీగా స్టేషన్ రైటర్లకు, టెక్ టీమ్ సిబ్బందికి కోర్టు సిబ్బందికి, ఇన్వెస్టిగేషన్ అధికారులకు, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కసారి డాటా ఎంట్రీ చేస్తే ఏ అధికారైనా ఎక్కడైనా చెక్ చేసుకోవచ్చన్నారు. అనంతరం ఐటీ కోర్ ఎస్ఐ శ్రీకాంత్, ఐటీ సెల్ కానిస్టేబుళ్ళ రాజిరెడ్డి, హరికృష్ణ, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రిసెప్షన్ సిబ్బందికి అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి



క్రీడలు నైపుణ్యాలతో పాటు మేథస్సును పెంపొందించుకునేందుకు సోపానాలని సర్పంచ్ బోయినిపల్లి నర్సింగ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తోటపల్లి ప్రభుత్వోన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు సర్పంచ్ నర్సింగ రావు పరీక్షల సామగ్రితో పాటు క్రీడల సామగ్రి అందజేశారు. పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సర్పంచ్ నర్సింగ రావు సూచించారు. పాఠశాల భోదన సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ - పటాన్ చెరు



కార్మికుల ఈపీఎఫ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఈపీఎఫ్ రీజనల్ కమిషనర్ విశల్ అగర్వాల్‌ను ఈపీఎఫ్ ప్రాంతీయ బోర్డ్ సభ్యులు కె.రాధాకృష్ణ కోరారు. బుధవారం పటాన్‌చెరులోని ఈపీఎఫ్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఆధార్, పుట్టిన తేదీల్లో మార్పులవల్ల కార్మికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో చాలా పరిశ్రమల్లో వలస కార్మికుల ఈపీఎఫ్ కంట్రిబ్యూటార్ కాంట్రాక్టర్ లు సరిగ్గా చెల్లించడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈపీఎఫ్ చందాలు కట్టని కాంట్రాక్టులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ను కోరారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి యూనియన్ నాయకులు వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీలో ఘర్షణ

నవతెలంగాణ- సదాశివపేట



సదాశివపేటలోని ఐబీలో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ నేతలను స్టేజ్‌పైకి ఎలా పిలుస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కార్యక్రమం నిర్వహిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం 100 రోజులలో ఆరు పథకాలను అమలు చేసి తీరుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన చూసి నిద్ర పట్టడం లేదని ధ్వజమెత్తారు. ఇందులో అధికారుల లోపం ఉందన్నారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. బీసీ బంధు చెక్కుల హోల్డ్‌లో పెట్టారన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జయప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టానికి విరుద్ధంగా లారీ డ్రైవర్ల సమ్మె

నవతెలంగాణ జహీరాబాద్



కేంద్ర ప్రభుత్వం అమాయక లారీ డ్రైవర్లను, ఓనర్లను వేధింపులకు గురి చేసే విధంగా హిట్ అండ్ రన్ చట్టం తీసుకురావడం సరికాదని లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ ఖాజానియా అన్నారు. బుధవారం పట్టణంలోని లారీ అడ్డ నుండి జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లారీ ఓనర్లు డ్రైవర్లు పాల్గొన్నారు.

స్వీప్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



తుది ఓటర్ జాబితాలో అర్హులైన వారందరూ ఉండాలని, అనర్హులు ఎవరూ ఉండరాదని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ ఓటర్ నమోదు అవగాహనకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా నిర్వహించాల్సిన స్వీప్ కార్యక్రమాల పై మున్సిపల్ కమిషనర్లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అదనపు కలెక్టర్లు, స్వీప్ నోడల్ అధికారి డిఆర్ఓ, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, తహసిల్దారు, ఎంపీడీవోలు, ఆయా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పత్తాలాట



- ఫామ్‌హౌస్‌లు, అటవీ ప్రాంతాల్లో అడ్డా
- హైదరాబాద్ నుంచి వస్తున్న వీఐపీలు
- నర్సాపూర్, సదాశివపేట ఏరియాలో జోరు
- మొక్కుబడి దాడులు...వీఐపీలను వదిలేస్తున్న వైనం
- విలేకర్లు, పోలీస్‌లకు మాముళ్లు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్ శివారు ప్రాంతంగా ఉన్న నర్సాపూర్, సదాశివపేట ఇతర ప్రాంతాలు అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారుతుంది. నిర్మానుష్య ప్రాంతాలు, అటవీ ప్రాంతంలోని చెట్ల పొదలు, ఫామ్ హౌస్‌లు, పంట పొలాల్ని అడ్డాగా చేసుకుని పత్తాలాడుతున్నారు. పేకాటారాయులు లక్షల్లో డబ్బులు పెట్టి పత్తాలాడుతున్నా వ్యవహారం గుట్టుగా సాగుతోంది. రాజకీయ ప్రముఖులు, రియల్టర్లు, వీఐపీలు హైదరాబాద్ నుంచి వచ్చి పత్తాలాడిపోతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న జూదం వ్యవహారం అంతా తాము చూసుకుంటామంటూ కొందరు విలేకర్లు, పోలీసులు సైతం రోజువారి మాముళ్లు పుచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. మొక్కుబడిగా దాడులు చేసినా భారీ ఎత్తున లభించిన నగదును సైతం తక్కువ చేసి చూపడం, వీఐపీలను వదిలేయడంతోనే సరిపుచ్చుతున్నారన్న విమర్శలున్నాయి. పత్తాలాటకు అలవాటు పడి లక్షల్లో పోగొట్టుకుని ఆర్థికంగా నష్టపోతున్న వ్యక్తులున్నారు.

గుట్టుగా సాగుతున్న జూదం

నర్సాపూర్ ప్రాంతంలోని పలు చోట్ల మూడు ముక్కలాట గుట్టుగా సాగుతోంది. నర్సాపూర్ మండలంలోని నత్నాయిపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న ఫామ్ హౌస్‌ల్లో జోరుగా పేకాట ఆడుతున్నారు. మండలంలోని హనుమంతపూర్, అచ్చంపేట అటవీ ప్రాంతాల్లోనూ జోరుగా పత్తాలాడుతున్న వైనం కొనసాగుతుంది. నిత్యం హైదరాబాద్ నుంచి పెద్ద పెద్ద కార్లల్లో వస్తున్న పలువురు పేకాటరాయుళ్లు నర్సాపూర్ ఏరియాలోని ఫామ్ హౌస్‌లు, అటవీ ప్రాంతాల్లోని చెట్ల పొదలు, నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా చేసుకుని మూడు ముక్కలాట ఆడుతున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు, రియల్టర్లు, వ్యాపారస్తులు మూడు ముక్కలాట అలవాటుపడి రోజూ హైదరాబాద్ నుంచి వచ్చి జూదమాడిపోతున్నారు. స్థానికులు ఏర్పాటు చేసిన పేకాట శిబిరాల్లో మూడు మక్కలాట ఆడుతున్నారు. మూడు ముక్కలాటలో లక్షల్లో బెట్టింగ్ పెడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అటవీ ప్రాంతంలోని నిర్మానుష్య ఏరియాలో పత్తాలాడడం వల్ల అక్కడికి ఎవరూ చేరుకోలేని పరిస్థితి ఉంది. ఒక వేళ పోలీసులు అక్కడికి వెళ్లినా అంతలోపు పరారయ్యేందుకు ప్రత్యామ్నాయ దారుల్ని ఎంచుకున్నట్లు చెబుతున్నార. మూడు ముక్కలాట ఆడే శిబిరాల్లోకి ఎవ్వరూ రాకుండా చూసేందుకు కొందరు స్థానికుల్ని సైతం ఏర్పాట్లు చేసుకున్నట్లు చెబుతున్నారు. పోలీసులు దాడులు చేసినా మొక్కుబడిగా ఎంతో కొంత తక్కువ ఎమౌంట్‌ను స్వాధినం చేసుకుని ఎక్కువ నగదును వదిలేస్తున్నట్లు విమర్శలున్నాయి. వీఐపీలు పత్తాలాడుతున్నా వారిని అరెస్టు చేయకుండా వదిలేస్తున్న వ్యవహారం కూడా సాగుతోంది. హైదరాబాద్ నుంచి వచ్చి నర్సాపూర్ ప్రాంతంలో దర్జాగా పత్తాలాడిపోతున్న జూదర్లు కొందరు విలేకర్లకు, పోలీసులకు సైతం భారీ ఎత్తున నగదు ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది. జూదానికి అలవాటు పడిన పేకాటరాయుళ్లు మూడు ముక్కలాట ఆడి లక్షల్లో డబ్బును పోగొట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. నర్సాపూర్ ఏరియాలోని పలు అటవీ ప్రాంతాలు మూడు ముక్కలాటకు అడ్డాలుగా మారాయని చెప్పాలి. నర్సాపూర్‌తో పాటు చుట్టుముట్టు ప్రాంతాల్లో కూడా పత్తాలాట సాగుతున్నట్లు చెబుతున్నారు. అదే విధంగా సంగ్గారెడ్డి జిల్లాల్లోని సదాశివపేట ప్రాంతంలోనూ పత్తాలాట జోరుగా సాగుతుంది. నిర్మానుష్య ప్రాంతంలో పేకాటరాయుళ్లు పత్తాలాడుతున్నారు. ఏ రోజుకారోజు పత్తాలాడే ప్రాంతాన్ని మార్చుతున్నట్లు సమాచారం. సదాశివపేట ప్రాంతంలో పత్తాలాటకు ఎలక్ట్రానిక్ మీడియా టీవీల పేర్లను కోడ్ బాషగా వాడుతున్నారు. పేకాటలో పెట్టే బెట్టింగ్ రేట్‌ను బట్టి టీవీ పేరును పెట్టి పిలుస్తున్నారు. ఎక్కువ ఎమౌంట్ పందెంలో పెట్టే ప్రాంతాన్ని ఎక్కువ రేటింగ్ ఉన్న టీవీ పేరుతో చెబుతున్నారు. అంటే ఎక్కడెక్కడ ఎంత బెట్టింగ్ పెడుతున్నారనేది డబ్బుల రూపంలో కాకుండా టీవీల పేర్లను కోడ్‌గా పిలుచుకుంటున్నారు. మండలంలోని పలు నిర్మానుష్య ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. స్థానికులతో పాటు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి కార్లల్లో వచ్చి మూడు ముక్కలాట ఆడిపోతున్నారు. రోజూ లక్షల్లో పత్తాలాటలో చేతులు మారుతున్నాయి.

మొక్కుబడి దాడులు... వీఐపీలను వదిలేస్తున్న వైనం

నర్సాపూర్, సదాశివపేట ఇతర ప్రాంతాల్లో నిత్యం పత్తాలాడుతున్నట్లు తెలుస్తోంది. అయితే పత్తాలాడే చోటు గురించి తెల్సిన వెంటనే పోలీసులు దాడులు చేస్తున్నా అవి మొక్కుబడిగా సాగిపోతుంది. ఇటీవల నర్సాపూర్ ఏరియాలో పత్తాలాడుతున్న సమాచారం తెల్సుకున్న పోలీసులు దాడి చేసి 18 మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.40 లక్షల నగదును స్వాధినం చేసుకున్నారు. అయితే జూదర్ల నుంచి సెల్‌పోన్స్, వాహనాల్నినన స్వాధినం చేసుకోకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. లక్షల్లో నగదు లభించినట్లు చెబుతున్నారు. పత్తాలాడిన వారిలోనూ వీఐపీలుండడం వల్ల వాళ్లను వదిలేశారంటున్నారు. సదాశివపేటలోనూ పత్తాలాడుతున్న సమాచారం తెల్సినా వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. దాడి చేసినా ఎంతో కొంత తక్కువ ఎమౌంట్‌ను స్వాధినం చేసుకుని వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి.

కొందరు విలేకర్లకు రోజువారి మాముళ్లు

పత్తాలాడుతున్న వాళ్ల గుట్టును రట్టు చేయకుండా అంతా తాము చూసుకుంటామంటూ కొందరు రోజువారి మాముళ్లు పుచ్చుకుంటున్నట్లు విమర్శలున్నాయి. నర్సాపూర్ ఏరియాలో పేకాటరాయుళ్ల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు పుచ్చుకుంటున్న వారిలో కొందరు విలేకర్లు, పోలీసులు ఉన్నట్లు విమర్శలున్నాయి. రోజుకు రూ.70 నుంచి 80 వేల వరకు కొందరు విలేకర్లకు పేకాటరాయుళ్ల నుంచి డబ్బులు ముడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. తమకు డబ్బులు ఇస్తే చాలు అన్నీ తామే చూసుకుంటామని చెప్పి భరోసా ఇస్తున్న కొందరు విలేకర్లు పేకాటరాయుళ్లకు సహకరిస్తున్నట్లు విమర్శలున్నాయి. నర్సాపూర్ ఏరియాలోని అటవీ ప్రాంతంలో జోరుగా సాగుతున్న పత్తాలాట గురంచి గుట్టు రట్టు కాకుండా విలేకర్లు, పోలీసులకు కొంత డబ్బు ముట్టచెబితే చాలనే భావనలో పేకాటరాయుళ్లు ఉన్నట్లు చెబుతున్నారు. పెద్ద పెద్ద కార్లల్లో వచ్చి మూడు ముక్కలాట ఆడుతున్న పేకాటరాయుళ్ల లోగుట్ట తెల్సినా ఎవ్వరూ పట్టించుకోకపోవడం పలు విమర్వలకు దారి తీస్తుంది.

నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- నియోజకవర్గం అభివృద్ధికి రూ.10 కోట్లు
- ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు ఆదేశం
- 20న మరోసారి సమీక్ష సమావేశం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధే తన ధ్యేయమని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని, మీ స్థాయిలో పరిష్కారంకాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, చేసే పనిలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ నియోజకవర్గ మూడు జిల్లాలతో కూడి ఉన్న నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసిమెలిసి పనిచేయాలన్నది నా సిద్ధాంతం అని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమం తర్వాత జనరల్ పిటీషన్స్ తగ్గినట్లు చెప్పారు.నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్ల రూపాయలను కేటాయించిందని, నిధులతో ప్రజలకు అత్యవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుదామన్నారు.మంజూరు అయినా పనులు, వాటిలో ఇప్పటికి



ప్రారంభం కాని పనులు, ప్రారంభమై వివిధ స్థాయిలో ఉన్న పనుల వివరాలను తెలియజేయలన్నారు. ఈనెల 20న మరొకసారి అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి పనుల వివరాలపై సమీక్షిస్తానని ఈ లోపు పూర్తి వివరాలను సేకరించాలన్నారు. నేషనల్ హైవే నిర్మాణం సందర్భంగా ప్రమాదంలో చనిపోయిన వారి వివరాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డిఓ బెన్ సాలెం, హనుమకొండ, హుజురాబాద్ ఆర్డీవోలు, హుస్నాబాద్ ఏసీపి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కలలు నిజం చేసుకోవాలి



నవ తెలంగాణ-సంగారెడ్డి

ఉన్నతమైన కలలు కనాలని, అవి నిజమయ్యే వరకు విశ్రమించకూడదని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాల శాంతినగర్ లో జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు ఉత్సవాలు అటహాసంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సూపరెండెంట్ ఆఫ్ పోలీస్ సిహెచ్. రూపేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మూడు రోజులు కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉన్నతమైన కలలు కణాలని వాటి నిజమయ్యే వరకు విశ్రమించకూడదని తెలిపారు. మార్క్ జూకర్‌బర్గ్ ఫేస్ బుక్ ఫౌండర్, ఏపీజే అబ్దుల్ కలాం లాంటివారు కలలుకని చాలా ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. జిల్లా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ మనలో మనకు నమ్మకం కావాలని ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని దానిని సాధించేందుకు క్షమించాలని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన ఉన్నత పాఠశాల స్థాయి లో ప్రథమ ద్వితీయ స్థానాలలో పదిమందికి ప్రాథమికోన్నత స్థాయిలో పదిమందికి ఉపాధ్యాయ విభాగంలో ఇద్దరికీ బహుమతి ప్రధానం చేశారు. ఈ మూడు రోజుల కార్యక్రమానికి 11 కమిటీలలో పనిచేసిన కన్వీనర్లకు సభ్యులకు ఎన్సిసి విద్యార్థులకు జ్ఞాపకాలతో సత్కరించారు. 861 నమూనాలు విద్యార్థులు ప్రదర్శించారు. ప్రదర్శన చూడడానికి 69 పాఠశాలల నుండి 7200 మంది విద్యార్థిని విద్యార్థులు విచ్చేసారని డిఇఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట నరసింహులు గౌడ్, సెయింట్ ఆంటోనీ పాఠశాల ప్రిన్సిపాల్, కరుణాకర్ రెడ్డి, సెయింట్ ఆంథోనీ అకాడమిక్ డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు

ఖీజర్‌యాపైకి అభినందనలు



నవతెలంగాణ జహీరాబాద్

లక్షలాది రూపాయలు ఖర్చు చేసి క్రికెట్ టోర్నమెంటు నిర్వహించి క్రీడలను ప్రోత్సహించిన ఖీజర్‌యా పైకి ప్రముఖ జర్నలిస్ట్ ధారాసింగ్ అభినందించారు. బుధవారం కూడా క్రికెట్ టోర్నమెంట్ కొనసాగింది. ఖీజర్‌యాపై గోల్డ్ కప్ టోర్నీలో భాగంగా నాలుగవ రోజు రెండు మ్యాచులు సాగాయి. మొదటి మ్యాచులో టాస్ ముఖ్య అతిథి మాజీ కౌన్సిలర్ మోతీరం రాథోడ్ టాస్ వేసి నాలగవ రోజు ఆటలను ప్రారంభించారు. మొదటి పోటీలో భాగంగా ఫ్రెండ్ సిసి జహీరాబాద్ మరియు ధారసింగ్ సంగారెడ్డి జట్ల మధ్య జరిగిన పోటీలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఫ్రెండ్ సిసి 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేయగా 173 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన డి ఎస్ ఎలెవన్ 18.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 174 డిఎస్ ఎలెవన్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించి సెమి ఫైనల్లో ప్రవేశించింది. మనోహర్ గౌడ్ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ముఖ్య అతిధులు కోహిర్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ వాహిద్ చేతుల మీదుగా ఇచ్చారు. రెండవ మ్యాచులో టాస్ గెలిచిన నిజామాబాద్ సిసి మొదట బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 144 పరుగులు చెయ్యగ 145 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేషనల్ సిసి జహీరాబాద్ సిసి 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయ లక్ష్యానికి చేరుకొని 3 వికెట్ల తేడాతో నిజామాబాద్ జట్టుపై ఘన విజయం సాధించింది. అల్ రౌండర్ గా రాణించిన శాంతన్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ముఖ్య అతిధి మొహమ్మద్ మహెబూబ్ పిచారేగడి చేతుల మీదుగా ఇచ్చారు. టౌర్ని అధికార ప్రతినిధి రాములు నేత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా అస్లాం ఫారుఖి, టౌర్ని అధికార ప్రతినిధి సయ్యద్ మహెబూబ్ అలీ, తెలంగాణ వికలాంగ వేదిక అధ్యక్షుడు రాయికోటి నర్సింలు, ప్రముఖ వ్యాఖ్యాత అబ్దుల్లా సిద్దిఖీ, విజయ్ రాథోడ్, మాక్సుద్ అలీ, మహమ్మద్ అలీ, అదం యఫై, అబుద్ యఫై, అజ్మత్, పాషా, శెట్టి వెంకట్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్పీల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు పని చేస్తున్న మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మంత్రి కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. పెరిగిన ధరలు అనుగుణంగా కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలన్నారు. పట్టణ పేదరిక మహిళల్లో ఆర్థిక స్వాలంబనకు కృషి చేస్తున్న ఆర్పీలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నెలనెలా వేతనాలు చెల్లించే వెసులుబాటు కల్పిస్తూ, ఆర్పీలకు డ్రెస్సు, ఐడి కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య బీమా సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని జాబ్ చార్ట్ తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ఆర్పిల కుటుంబాలకు 5 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఉద్యోగులు ఆర్ లు పాల్గొన్నారు







నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

నవతెలంగాణ-సంగారెడ్డి: నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల పక్షాన వార్తలు రాయాలన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించడంతో పాటు విజ్ఞాన పరమైన అంశాలను కూడా ప్రచురించాలన్నారు. నవతెలంగాణ మెదక్ రీజియన్ మేనేజర్ రేవంత్‌కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా స్టాఫ్‌రిపోర్టర్ మేకల కృష్ణ, సంగారెడ్డి రిపోర్టర్ ఎం. బాలరాజు, సర్క్యూలేషన్ బాధ్యులు ప్రవీణ్ పాల్గొన్నారు. నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైద్యనాథ్ కూడా నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్యం, నవతెలంగాణ ఉమ్మడి మెదక్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేకల కృష్ణ, రిపోర్టర్ బాలరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారంపై కఠిన చర్యలు తీసుకోవాలి

తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి బి.యాదవరెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి



ట్రైడెంట్ చక్కెర కర్మాగారంపై వెంటనే చర్యలు తీసుకొని రైతులకు వెంటనే బకాయిలు రూ.9 కోట్లు చెల్లించాలని, వెంటనే చెరుకు క్రషింగ్ ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి బి.యాదవరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో రైతాంగం ట్రైడెంట్ చక్కెర కర్మాకారాన్ని నమ్ముకుని గత సంవత్సరం 11 వేల హెక్టార్లలో దాదాపు 8500 మంది రైతులు చెరుకు పంట సాగు చేశారన్నారు. ఈ పరిశ్రమం గత సంవత్సరం రూ.9 కోట్లు రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. యాజమాన్యం మొండి వైఖరితో పరిశ్రమను మూసివేసిందన్నారు. ఈ సంవత్సరం చెరుకు పంట సాగు చేస్తున్న రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా గత సంవత్సరం బకాయిలు నేటికీ ఇవ్వలేదన్నారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని రైతులకు బాకీ ఉన్న తొమ్మిది కోట్ల రూపాయలు వెంటనే చెల్లించి , క్రషర్ ప్రారంభించి రైతులు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే. రాజయ్య ఉపాధ్యక్షులు నీరుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను ప్రదర్శించిన గీతం విద్యార్థులు

నవ తెలంగాణ - పటాన్ చెరు



విద్యార్థుల సృజనాత్మకత, పరిశోధన, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలను ప్రదర్శించేలా 'పోస్టర్ ఎగ్జిబిషన్'ను బుధవారం గీతం హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ నిర్వహించారు. డిజిటల్ హ్యూమానిటీస్ అంతర్ విభాగ స్వభావాన్ని, సమకాలీన సమాజంలో దాని ఔచిత్యాన్ని ప్రతిబింబించేలా ఈ ప్రదర్శన సాగింది. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లెఫ్ట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఏ నాలుగో సెమిస్టర్ విద్యార్థులు తమ పరిశోధనా ప్రాజెక్టులను గోడ పత్రికలుగా రూపొందించి, అందరి ముందు ప్రదర్శించారు.పత్రికలు, డిజిటల్ సమాచారం: సారూప్యం, మార్పు, భవిష్యత్తుటీ ఇన్స్టాగ్రామ్ ద్వారా వ్యక్తిత్వాల ఆవిష్కరణ: డిజిటల్ ప్రపంచంలో పిల్లల పెంపకంటీ క్రీడలు, నిరసనలు, మీడియాటీ కెమెరా వెనుక (భారత చలనచిత్ర పరిశ్రమలో మహిళలు)టీ భవన నమూనాల రూపకల్పన, నిర్మాణాలపై కృత్రికు మేథ ప్రభావం: ఆర్థిక అసమానత ధోరణలు వంటి సలు సమాకాలీన అంశాలపై విద్యార్థులు పరిశోధించి, పోస్టర్ల రూపంలో వాటిని ప్రదర్శించారు. సాంకేతికత, సమాజం, సంస్కృతి విభజనలపై లోతైన విశ్లేషణ చేశారు. ఆయా ప్రాజెక్టులు విమర్శనాత్మక విశ్లేషణ, సృజనాత్మకత వ్యక్తీకరణకు వేదికగా మారాయి.జీఎహెచ్ఎస్ డైరెక్టర్ సన్నీ గోస్మాన్ జోస్, పలువురు అధ్యాపకులు, తోటి విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని, పలు సందేహాల గురించి అడిగి నివృత్తి చేసుకున్నారు.

నరేంద్ర మోడీని గద్దె దించాలి

నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్



కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, గత ప్రభుత్వ బిఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం బందీ అయిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి విమర్శించారు. బుధవారం హుస్నాబాద్ లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహారాష్ట్రలో దుర్వినియోగంతో క్షమాభిక్ష పెట్టడంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టుల తీర్పునిచ్చిందన్నారు. ఎన్డీఏ కుటుంబంతో కలుపుకొని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. బిజెపి రాముని పేరుతో వేషాలు జిమ్మిక్కుల తో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు ,రాముడు మంచివాడని ప్రజలకు తెలుసాని అన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం గత ప్రభుత్వం పై కక్ష సాధింపు చర్యలు కాకుండా పరిశీలన చర్యలు చేపట్టాలని అన్నారు. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల సందడి నెలకొందన్నారు. కాంగ్రెస్ సిపిఐ పార్టీని కలుపుకొని పోవాలని అన్నారు. కెసిఆర్ చట్టాలను ఉల్లంఘించారని ,కెసిఆర్ అహంకారమే బిఆర్ఎస్ ఓటమికి కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జేరిపోతుల జనార్ధన్, గడిపె మల్లేష్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాలి

నవతెలంగాణ- సదాశివపేట



అధికారిక కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తాను ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారిక కార్యక్రమాలు, అభివృద్ధి-సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలలో ఎమ్మెల్యేకు మొదట ప్రాధాన్యత ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకాకుంటే ప్రజల పక్షాన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల పట్ల మొండి వైఖరి వీడాలి

నవతెలంగాణ-జహీరాబాద్



కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న మొండి వైఖరిని వెంటనే విడనాడాలని ఆ సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ అన్నారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో బుధవారం భోజన విరామ సమయంలో విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు చెల్లించాల్సిన వితరణ సవరణ చేపట్టాలన్నారు. వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, వెంకటరమణ, నరసింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 2

సమగ్ర తెలుగు దినపత్రిక

సంగారెడ్డి

గురువారం | 11 జనవరి 2024 | www.navatelangana.com

టీపీటీఎఫ్, టీఆర్టీయూ క్యాలెండర్‌లు ఆవిష్కరణ

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ పట్టణంలోని ఆయన స్వగృహంలో టీపీటీఎఫ్, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి పెట్టి.. పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులకు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, కిషన్ రావు, కిఫాయిడ్ అలీ, నర్సింలు, బాబురావు, దీపక్, రమేష్ రెడ్డి, భీమ్ రావు, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పొలంలోనే రైతు మృతి..



నవతెలంగాణ-జోగిపేట

వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా సొమ్మ రావడంతో ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆందోల్ మండల పరిధిలోని అక్సాన్‌పల్లి గ్రామంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి ప్రభాకర్ (35) పంట పొలంలో పనులు చేస్తుండగా.. అకస్మాత్తుగా సొమ్మ రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య మాధవి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ హరినారాయణ వర్మ, ఎంపీటీసీ మమత రాజువృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

సిర్గాపూర్ గ్రామానికి చెందిన కటికే షరీఫ్ కుమారుడు మోహిద్ రిసెప్షన్ బుధవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్ రెడ్డి, పార్టీ నాయకులు ఇస్మాయిల్, సాయిలు, భూమయ్య, సందీప్ సెట్, గ్రామ యూత్ అధ్యక్షుడు నార్స గౌడ్, మండల సోషల్ మీడియా అధ్యక్ష్యుడు రమేష్, సంగం సర్పంచ్ రవీందర్ నాయక్, లక్ష్మణ్ నాయక్ తాండా సర్పంచ్ పుండ్లిక్, బొక్కస్ గవ్ సర్పంచ్ విజయ్ కుమార్, నవీన్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్థివదేహానికి నివాళ్లు..

మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి రాజు మాతృమూర్తి బుధవారం ఉదయం మరణించింది. ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి.. మృతురాలి పార్థివదేహానికి నివాళ్లర్పించారు. అనంతరం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి.. మనో ధైర్యాన్ని అందించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జడ్పిటీసి నరసింహారెడ్డి, స్థానిక గ్రామ సర్పంచ్ కిష్టారెడ్డి, జిల్లా కోఆప్షన్ అలీ, ఎంపీటీసీ అంజయ్య సాగర్, తదితరులు, పాల్గొన్నారు.

రైతులకు అండాదండగా కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా రైతులకు అండాదం డగా ఉంటుందని మాజీ ఎంపీ సురేష్ షట్కార్ అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతే రాజు'గా భావించి పాలన సాగిస్తుందన్నారు. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేసిందన్నారు. అయితే ఆ రైతు చట్టాల రద్దు కోసం రైతాంగం పోరాటం చేసి.. మోడీ ప్రభుత్వం పై విజయం సాధించిందన్నారు. ఆ రైతాంగ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులకు అండగా రైతు భరోసా పథకం తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమ.. పేద ప్రజల సంక్షేమానికే కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నిరంజన్, కాంగ్రెస్ నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ 65 ఏండ్ల గుర్తు తెలియని వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. జహీరాబాద్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అనారోగ్యంగా ఉన్న ఓ వృద్ధుడిని చికిత్స నిమిత్తం రెండ్రోజుల క్రితం స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతడు బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ వైదేశాల మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే స్థానిక పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

జిన్నారంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో ఆధార్ కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో జిన్నారం డిప్యూటీ తహసీల్దారుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో రెండు ఆధార్ సెంటర్లను ఇక్కడ నిర్వహించారని గుర్తు చేశారు. ప్రజల సౌకర్యార్థం వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ స్వామి, వీరేష్, మల్లేష్, దుర్గేష్, అంజనేయులు, అశోక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు

పండుగకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వండి

నవతెలంగాణ-జహీరాబాద్

సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు వెళ్ళే వారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని.. తద్వారా దొంగతనాలు జరగకుండా జాగ్రత పడొచ్చని సీఐ రాజు తెలిపారు. సొంత ఊర్లకు పయనమయ్యేవారు ఇక్కడి ఇండ్లల్లో విలువైన నగలు, డబ్బులు ఉంచొద్దన్నారు. విలువైన సామాగ్రి, బంగారు నగలు, డబ్బులు తమ వెంబడి తీసుకువెళ్లాలని లేదా బ్యాంకుల్లో పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డ్రయినేజీ పనుల పరిశీలన



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని 11వ వార్డ్ బీరప్ప బస్తీలోని శ్రీ సాయినికేతన్ ప్రయివేటు స్కూల్ ఎదుట నుంచి వేస్తున్న అండర్ డ్రయినేజీ పైప్ లైన్ పనులను బొల్లారం మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ కమిషనర్ సంగారెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, మాజీవార్డ్ మెంబెర్ శారద పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు మహా అన్నదానం



నవతెలంగాణ-జోగిపేట

జోగుపేట పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు మహా అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. జోగిపేట పట్టణానికి చెందిన అయ్యప్ప స్వాములు శబరిమలై తరలి వెళ్లగా.. పట్టణానికి చెందిన డాకూరి అభిలాష్, పద్మ సుధీర్, పట్లోళ్ల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రవ మాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన భక్తులు అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పింఛన్‌దారుల అవస్థలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



పింఛన్‌దారుల అవస్థలు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆసరా పెన్షన్ లబ్దిదారులు గంటల తరబడి వేచి వున్నా, రావాల్సిన పెన్షన్ రావట్లేదు అని వాపోతున్నారన్నారు. తీరా అధికారులను సంప్రదిస్తే.. పరిష్కారం చెప్పకుండా ప్రజల పైనే విసుగుంటున్నారన్నారు. పెన్షన్ డబ్బులను ఏ తేదీల్లో ఇస్తారన్న స్పష్టత కూడా లేకపోవడం వల్ల.. ప్రతీ రోజు వికలాంగులు, వితంతువులు, ముసలి వాళ్ళు అధికారుల దగ్గరికి వచ్చి తిరిగి వెళ్తుండడం బాధాకరంగా ఉందన్నారు. దీని పైన ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఏండ్లు గడిచినా.. ఎదురు చూపులే



- గత కొన్నేండ్లుగా మంజూరు కానీ రేషన్‌కార్డులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంతో కొత్తవాటికి పీఠముడి
- కొత్త ప్రభుత్వంపై ఆశలు..
- లబ్ధిదారులకు తప్పని తిప్పలు

నవతెలంగాణ-ఝరాసంగం

రేషన్ కార్డుల జారీ ప్రక్రియ గత తొమ్మిదేండ్లుగా నిలిచిపోయింది. నాటి నుంచి ఎంతోమంది ఎన్నో విధాలుగా దరఖాస్తులు పెట్టుకుని.. కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. రేపో మాపో ప్రభుత్వం కార్డులు జారీ చేస్తుందని గత తొమ్మి దేండ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్నా.. జారీ మాత్రం జరగలేదు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలోని కుటుంబాల సంఖ్య కన్నా.. రేషన్ కార్డుల జారీ అధికంగా ఉందని గుర్తించిన అప్పటి ప్రభుత్వం కొత్త కార్డుల జారీ, మార్పులు, చేర్పులను నిలిపివేసింది. దాంతో నాటినుంచి దరఖాస్తులన్నీ పెండింగ్ ఉంటూ వస్తున్నాయి.

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీల్లో 6,569 ఇండ్లు ఉన్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. అయితే ప్రస్తుతం మండలం మొత్తం 12,306 కార్డులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి మాత్రమే రేషన్ కార్డు జారీ చేయాలి(అనగా మొత్తం జనాభాలో 60 శాతం మందికి రేషన్ కార్డులు జారీ చేయాలి). కానీ ప్రస్తుతం 90 శాతం మందికి రేషన్ కార్డులు జారీ అయ్యాయని తెలుస్తోంది. సమగ్ర కుటుంబ సర్వేలోని కుటుంబాల సంఖ్య కన్నా రేషన్ కార్డుల జారీ అధికంగా ఉందని గుర్తించిన అప్పటి ప్రభుత్వం కొత్త కార్డుల జారీ, మార్పులు, చేర్పులను నిలిపివేసింది. ఇటీవల నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన 6 గ్యారంటీ పథకాలకు, ప్రజాపాలన కార్యక్రమాలకు రేషన్ కార్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్తగా నమోదు చేసుకున్న వారికి కార్డు రాలేదు. తిరిగి కొంతమంది వేరు చేయడం కోసం రద్దు చేశారు. కానీ కొత్తగా నమోదు ప్రక్రియ చేయకపోవడంతో చాలామంది ప్రజలు దరఖాస్తు చేసుకోవడానికి కూడా వీలు లేకుండా పోయింది.

ప్రజా పాలనలో కొత్త రేషన్ కార్డు మంజూరు కొరకు లబ్ధిదారులు తెల్ల కాగితంపై 1396 దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారెంటీలకు రేషన్ కార్డు కీలకం కావడంతో తామంతా అర్హులము కాదేమోనని నిరాశ చెందుతున్నారు. కావున ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంపై శ్రద్ధ తీసుకొని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రద్దు చేస్తారా? లేక మళ్లీ పునరుద్ధరిస్తారా? లేక కొత్తగా దరఖాస్తు చేసుకుంటారా అనేది ప్రభుత్వం స్పష్టతనివ్వాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఒక దేశం, ఒక రేషన్ కార్డు అనే నినాదం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వం అనుసంధానంతో ప్రజలు దేశంలో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకునే అవకాశం కల్పించింది. కానీ ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల జారీ, మార్పుల చేర్పులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ అనుసంధానంతో చేయాల్సిన పరిస్థితులు ఏర్పడాయి. దాంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పీఠముడి పడనట్టు అయింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని రేషన్ కార్డుల్లో లబ్దిదారులు ఈ కేవైసీ చేసుకోవాలని సూచించింది. దాంతో రేషన్ దుకాణాలలో లబ్దిదారులు ఈ-కేవైసీ చేసుకున్నారు. ప్రస్తుతం వారికి రేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. మిగతావారు చనిపోయినట్లుగా గుర్తించి వారి కార్డులను రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఈ సమస్యపై దృష్టి కేంద్రీకరించి కొత్త రేషన్ కార్డుల జారీ, మార్పులు చేర్పుల ప్రక్రియ చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మోడల్ మార్కెట్‌గా పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్

నవతెలంగాణ-పటాన్‌చెరు



రానున్న రోజుల్లో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దబోతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులోని యశ్వంత్‌పూర్, చిక్కల్లాపూర్ మార్కెట్ యాడలను ఎమ్మెల్యే, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ నేతృత్వంలోని బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం ఆయా మార్కెట్ కమిటీల అధికారులతో సమావేశమై క్రయ విక్రయాలు, దుకాణాల కేటాయింపులు, వ్యాపార నిర్మాణ అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఐదేండ్ల క్రితం ఏర్పాటు చేసిన పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అతి కొద్ది కాలంలోనే ఏటా ఆరు కోట్ల టర్నోవర్ స్థాయికి చేరుకోవడం జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న కల్లుగీత కార్మికులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని ఆ సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతికి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను బుధవారం వారు మర్యాదపూర్వకంగా కలిసి ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గీత కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. ఆశన్న గౌడ్, ఎస్. రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలో అనేక మంది కల్లుగీత కార్మికులు 50 ఏండ్లు పైబడిన వారు పెన్షన్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి జిల్లా ఎక్సైజ్ అధికారుల గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో అధికారుల పరిశీలనలో వాటిని తొలగించే ప్రమాదం ఉందన్నారు. దరఖా స్తు చేసుకున్న వారందరికీ జిల్లా ఎక్సైజ్ శాఖ నుంచి వెంట నే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అర్హులైన వారం దరికీ పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటి వరకు పెండింగ్‌లోఉన్న టీఎఫ్‌టీలైసెన్సులను వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడ ంట్ జంగన్న గౌడ్, సంగారెడ్డి మండలాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు కృష్ణాగౌడ్, నాయకులు గణేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ర్యాకల్ క్లస్టర్ కేంద్రంలో బుధవారం నిర్వహించిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రభుత్వ మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతు న్నదని .. అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన మహిళలకు, బాలికలకు ప్రభుత్వం ద్వారా కుట్టు మిషన్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కాగా సర్పంచ్ సుజాతమ్మ, ఎంపీపీ చాందిబాయ్ రాంచేందర్ చౌహాన్‌తో కుట్టు మిషన్లను ఎమ్మెల్యే అందజేశారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు సుధాకర్ రెడ్డి, జిల్లా నాయకులు, రమేష్ చౌహన్ ఎంపీపీ తనయుడు, రాజేశ్వర్ మాజీ సర్పంచ్, రాంరెడ్డి, జైపాల్‌యాదవ్ ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా, నాణ్యతతో పనులు చేపట్టాలి

డా.పట్లోళ్ల సంజీవరెడ్డి శాసనసభ్యులు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



పల్లె ప్రగతిలో పారదర్శకత అవసరమని.. నిర్వహించే పనుల్లో నాణ్యత ఉన్నప్పుడే ప్రజల జీవనగమనం మరింత మెరుగుపడుతుందని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోల సంజీవరెడ్డి అన్నారు. మండల పరిషత్ ఆవరణలో నిర్వహించిన బుధవారం నిర్వహించిన 13వ సోషల్ ఆడిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల్లో, పనుల్లో అవకతవకలు జరగకుండా పారదర్శకంగా నాణ్యతతో చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, పాలన యంత్రాగమంతా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన పనులు చేపట్టి అభివృద్ధికి కృషి చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, మండల పరిషత్ అధ్యక్షురాలు కర్ర చాంది భాయ్ ఛోహన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఎంపీపీ తనయుడు బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-కంగ్టి

మండల కేంద్రమైన కంగ్టిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. ఉద్యమాలు, పోరాటాలే కాకుండా విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఆటలు, పోటీ పరీక్షలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడంలోనూ ముందున్నట్టు తెలిపారు. కాగా ఈ ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీది దొడ్డి పవన్, నాయకులు సోపాన్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

నవతెలంగాణ-జహీరాబాద్



చెరకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. జహీరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంత చెరకు రైతులకు పరిశ్రమ యాజమాన్యం బకాయిల ఉన్న డబ్బులను వెంటనే చెల్లించాల న్నారు. చెరకు రైతుల కోసం గతంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. స్థానికంగా ఉన్న చెరకు ఫ్యాక్టరీ యాజమాన్యం సరైన సమయంలో క్రషింగ్ చేయకపోవడం, గత సంవత్సరం క్రషింగ్ అయినా బకాయి డబ్బులను నేటికీ విడుదల చేయకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చెరకు రైతుల బకాయిలు విడుదల చేయించాలని.. లేని యెడల జహీరాబాద్ చెరకు రైతులు మరో ఉద్యమానికి నాంది పలుకుతారని హెచ్చరించారు. అంతేకాకుండా ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం రైతుబంధును వెంటనే విడుదల చేయాలన్నారు.

సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహిళలు వారి ఇంటి ముందే ముగ్గులు వేయాలని.. తమ న్యాయ నిర్ణేతలు ఆ ముగ్గులను పరిశీలించి మొదటి, రెండో బహుమతులను ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమం జహీరాబాద్ టౌన్లోని వివిద కాలనీలల్లో జరుగుతుందని..ఎక్కడికక్కడే కాలనీలకు వచ్చి మొదటి, రెండో బహుమతులు నిర్ణయించి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మల్చల్మా సొసైటీ చైర్మెన్, న్యాయవాది బుచ్చిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ం సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగ న్నాథ్, బీజేపీ మండలాధ్యక్షులు అడివన్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా పీవైఆర్ ఫౌండేషన్

నవతెలంగాణ-జోగిపేట



పీవైఆర్ ఫౌండేషన్ పేదలకు అండగా నిలుస్తూ.. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆ ఫౌండేషన్ చైర్మెన్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి తెలిపారు. జోగిపేట వాసవి కళ్యాణ మండపంలో పీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. తాను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చానని.. అంచలంచలుగా ఎదిగి ఈ స్థాయికి చేరుకున్నట్టు గుర్తు చేశారు. నరేంద్ర మోడీ మన దేశానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. తాను ఇప్పటివరకు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చానని.. జహీరాబాద్ పార్లమెంటు నుంచి తనకు ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇస్తే రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేసుకుంటానన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతిగా ఈ. స్వప్నకు రూ.15000, ద్వితీయ బహుమతిగా యన్. యాదలక్ష్మికి రూ. 10,000, తృతీయ బహుమతిగా చిట్యాల మానస రూ.5000లను చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఆర్.ప్రభాకర్ గౌడ్, జిల్లా నాయకులు జే. ప్రభాత్, నాయకులు శ్యామా గౌడ్, నర్సింలు, మహేందర్, శివచందర్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గోలి పద్మ ప్రధాన కార్యదర్శి గజవాడ మంజుల, సహాయ కార్యదర్శి కాసాల నాగమణి, ఉపాధ్యాయులు శ్రీలత, సుగుణ లు పాల్గొన్నారు.

వట్‌పల్లి ఎంపీడీఓగా అశోక్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-వట్‌పల్లి



వట్‌పల్లి నూతన ఎంపీడీఓగా అశోక్ బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఉన్న ఎంపీడీఓ జగదీశ్వర్ ఈనెల 3న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకోవడంతో.. జోగిపేట ఎంపీడీవో కార్యాలయంలో సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పి.అశోక్‌ను తాత్కాలిక ఇన్‌ఛార్జిగా నియమించారు. అయితే బుధవారం ఇన్చార్జి నియామకాన్ని రద్దుచేసి పూర్తిస్థాయి ఎంపీడీవోగా అశోక్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్, గాంధీనగర్‌లో అక్రమ నిర్మాణాలను హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులతో కలిసి బుధవారం కూల్చివేశారు. అయితే గాంధీనగర్‌లో రెండు వేర్వేరు వర్గాలు మందిరాలు నిర్మిస్తుండగా.. ఒక వర్గానికి చెందిన మందిరం కూల్చి వేయడంతో ఆ వర్గం వారు గాంధీ బొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. దాంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో ధర్నాను విరమించారు. కూల్చివేతల కార్యక్రమంలో హెచ్ఎండీఏ సైట్ ఆఫీసర్ రమణారెడ్డి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ముమ్మరం

నవతెలంగాణ-జిన్నారం



ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని జిన్నారం మండల వ్యాప్తంగా అధికార యంత్రాంగం ముమ్మరంగా నిర్వహిస్తున్నది. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలకు గాను 7956 దరఖాస్తులు రాగా.. బొల్లారం మున్సిపాల్టీలో 8515 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా గడ్డపోతారంలో 1015, అత్య ల్పంగా లక్ష్మీపతిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో 224 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈనెల 17 వరకు దరఖాస్తులకు సంబంధించిన ఆన్‌లైన్ నమోదు పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో రాములు, తహసీల్దార్ రవికుమార్, బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పర్యవేక్షణలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
గురువారం | 11 జనవరి 2024 | www.navatelangana.com

ఎరువుల కొనుగోలుకు ఆధార్ తప్పని సరి



- ఏడిఏ విజయలక్ష్మి

నవతెలంగాణ-పాపన్నపేట : ఎరువుల కొనుగోలు చేయాలంటే ఆధార్‌కార్డు తప్పనిసరని ఏడిఏ విజయలక్ష్మి స్పష్టం చేశారు. బుధవారం పాపన్నపేట డీసీఎంఎస్ తనిఖీ చేసిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతుల ఆధార్ నంబర్ ఈ పాస్ మిషన్లో నమోదు చేసిన తర్వాతనే ఎరువులు విక్రయిస్తారని చెప్పారు. తద్వారా ఎరువులు పక్కదారి పట్టకుండా చూడొచ్చన్నారు. ఎరువుల విక్రయ నిర్వాహణను క్రమబద్ధం చేయడానికి ఇటీవల ప్రభుత్వం(ఫైవ్స్) ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం అమల్లోకి తెచ్చిందన్నారు. దీని ద్వారా వ్యవసాయ అధికారులు వారానికి 10 ఫర్టిలైజర్ షాపులు తనిఖీ చేస్తారన్నారు. ఫర్టిలైజర్ డీలర్లు ప్రతి విక్రయాన్ని ఈ పాస్ మిషన్లో నమోదు చేయాలని సూచించారు. మిషన్ ప్రకారం వాస్తవ స్టాక్ ఉండేలా చూడాలని కోరారు. ఈ విధానం ద్వారా ఎరువుల వినియోగం ఆన్లైన్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రైతులు అనవసరంగా ఎక్కువ ఫర్టిలైజర్ క్రిమి సంహారక మందులు వినియోగించి పంటలను కలుషితం చేయ వద్దని కోరారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకే ఎరువులు వాడాలని సూచించారు. ఆమె వెంట పాపన్నపేట వ్యవసాయ అధికారి క్రిష్ణ ఉన్నారు.

అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఆపాలి

- జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మహేందర్





నవ తెలంగాణ-టేక్మాల్

అసైన్డ్ భూముల్లో అక్రమాలు నిలిపివేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ కమిటీ మానిటరింగ్ మెంబర్ కొండి మహేందర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడారు. మండల కేంద్రమైన టేక్మాల్‌లోని సర్వేనెంబర్ 1989/ఆ, కు ఆనుకొని ఉన్న రెండేకరాల అసైన్డ్ భూమిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమాలు చేపట్టడమేంటని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి కోసం ప్రభుత్వ భూములను వాడుకుంటే తప్పులేదు కానీ ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన వ్యాపార లావాదేవీలు కొనసాగించుకోవడం కోసం అధికారులను మేనేజ్ చేసుకుంటూ అక్రమ నిర్మాణాలు చేపట్టడంలో పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. రెవెన్యూ సిబ్బంది నిజనిర్ధారణ చేసి సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిలో అక్రమాలు చేపట్టకుండా అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలు కొనసాగితే గ్రామస్తులతో కలిసి అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు హవేలీ ఘనపూర్ మండల సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-హవేలి ఘనపూర్

హవేలీ ఘనాపూర్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ శేరి నారాయణరెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఎంపీటీసీలు, సర్పంచులు విధిగా హాజరై మండల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కు తీర్చుకున్న ఎంపీటీసీ



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

మెదక్ ఎమ్మెల్యేగా డాక్టర్ మైనంపల్లి రోహిత్ విజయం సాధించినందుకుగాను కర్ణాటకలోని గానుగపూర్ శ్రీ దత్తాత్రేయ స్వామి, బీదర్‌లోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు బూరుగుపల్లి ఎంపీటీసీ అర్చన శ్రీనివాస్ తెలిపారు. హవేలీ ఘనపూర్ మండలంలోని బురుగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి 689 ఓట్ల మెజార్టీ రావడంతో మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకుల కృషి ఫలితమేనన్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకట్ రాములు, తదిరులు పాల్గొన్నారు.

12న ఇసుక డంప్ వేలం



తహసీల్దార్ శ్రీనివాస్

నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణ శివారులో గల అనధికార, అనుమతి లేని సీజ్ చేసిన ఇసుక డంప్‌లను ఈ నెల 12వ తేదీన వేలం వేయనున్నామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. 9వ తేదీన పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి 140 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ ఇసుకను మెదక్ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో డంప్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని తెలిపారు. ఆసక్తి గలవారు ఇసుక వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు తహసిల్దార్ కార్యాలయంలో రూ.5 వేల డిడిని ఏదైనా బ్యాంకు ద్వారా కట్టి వేలంలో పాల్గొనాలని సూచించారు.

విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకు వెళ్ళేది చేతిరాత

చేతిరాత నిపుణులు ఎజాజ్ హైమద్

నవ తెలంగాణ-మెదక్ టౌన్



విద్యార్థులను ఉన్నత స్థానానికి తీసుకెళ్లేది కేవలం చేతిరాత అని చేతిరాత నిపుణులు ఎజాజ్ అహ్మద్ అన్నారు. మెదక్ పట్టణంలోని స్థానిక చైతన్య భారతి ఉన్నత పాఠశాలలో బుధవారం చేతి రాతపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ చేతిరాత నిపుణులు ఎజాజ్ అహ్మద్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటు చేతిరాత బ్రహ్మాండంగా ఉండడం వలన అత్యున్నత స్థాయికి చేరుకుంటారన్నారు. గత 25 సంవత్సరాల నుంచి కొన్ని లక్షల మంది విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులలో రాయడంలో గల మెలకువలను నేర్పించానన్నారు. చేతి రాత విద్యార్థి భవిష్యత్తును నిర్ణయిస్తుందని, దానికి ఎల్లవేళలా తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం పాఠశాల కరస్పాండెంట్ జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ అన్నదానం ఒక పూట కడుపు నింపితే విద్యాదానం విద్యార్థి భవిష్యత్తునే మార్చేస్తుందన్నారు. ఎజాజ్ అహ్మద్ సేవలందుకోవడం మెలకువలు నేర్పడం పట్ల తమ విలువైన సూచనలు శిక్షణ ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. వీరితో పాటు ప్రిన్సిపల్ శ్రవణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే సింగరాళ్ల మల్లన్న

నవతెలంగాణ-తొగుట



ప్రాచీన కాలం నుంచి సింగరాల మల్లన్న ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని సర్పంచ్ సిలివేరి జ్యోతి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని జప్తి లింగారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని సింగరాళ్ల మల్లన్న ఆలయంలో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుండి సింగరాళ్ల మల్లన్న కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు.ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో భక్తు లు వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహి స్తారని అన్నారు.ఈ ఆలయ ప్రాముఖ్యతకు ఉన్న గొప్ప తనం రాతి కడప కలిగి ఉండడం గొప్ప తనం అని పెద్దలు చెబుతారని గుర్తు చేశారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్ : హుస్నాబాద్ డిపోకు నూతనంగా వచ్చిన రెండు కొత్త ఎక్స్ ప్రెస్ బస్సులను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు నూతనంగా వెయ్యి బస్సులు రాబోతున్నాయని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ప్రయాణం పెరిగిందని, బస్సుల్లో అక్యూపెన్సీ పెరిగడం తో కొత్త బస్సులు అవసరం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత ,సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, డి ఎం వెంకటేశ్వర్లు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్రాంతి మూఢాచారాలను నమ్మ వద్దు

సర్పంచ్ బుద్ద స్వర్ణలతభాగ్యరాజ్

నవతెలంగాణ-చేగుంట



ఈసారి సంక్రాంతి పండగ కీడు వచ్చిందని వస్తుందని వస్తున్న వదంతులను, మూఢాచారాలను ఎవ్వరు కూడా నమ్మవద్దని చందాయిపేట గ్రామ సర్పంచ్ బుద్ద స్వర్ణలత భాగ్యరాజ్ అన్నారు. కొడుకు, అల్లుడు పేరుతో రకరకాల ప్రచారాలు సోషల్ మీడియాల్లో చక్కర్లు కొడుతున్నాయన్నారు. ఇలాంటి ప్రచారాలకు మీడియా సంస్థలు కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వవద్దన్నారు. ఇప్పటికే ఒక్క కొడుకున్న మహిళలు 5 రకాల గాజులు తొడుక్కోవాలని ప్రచారం జరుగుతుండగా, మరోపక్క ఇంకో కొత్త ఆచారం వెలుగులోకి వచ్చింది. ఒక్క అల్లుడు వున్న వారు ఆ అల్లుడిని ఇంటికి పిలిపించుకొని ఆవు పాలతో కాళ్ళు కడిగి తులం బంగారం చేతిలో పెట్టాలని కొందరు ప్రచారం చేస్తుండడం గమనార్హం. ఎవరికీ ఎలాంటి కీడు రాలేదని అనవసరంగా గాబారాపడి ఈ ప్రచారాలకు వత్తాసు పలకొద్దని విద్యావేత్తలు అంటున్నారు.

జాతీయ భాష హిందీతోనే దేశ సమైక్యత

- అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నపూర్ణ

నవతెలంగాణ-మెదక్ టౌన్



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విశ్వ హిందీ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ హుసేన్ మాట్లాడుతూ హిందీ భాష నేడు విశ్వభాషగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల విశ్వవిద్యాలయాల్లో బోధింపబడుతున్నదన్నారు. మన విద్యార్థులు హిందీని అభ్యసించడం వల్ల దేశ, విదేశాల్లో చాలా మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. హిందీ విభాగ అధ్యక్షురాలు ఏ. అన్నపూర్ణ మాట్లాడుతూ భారత దేశం ప్రపంచంలో అనేక భాషలు మాట్లాడే ప్రజలందరినీ ఐక్యతగా ఉంచే శక్తి హిందీ భాషకు మాత్రమే ఉన్నదన్నారు. హిందీ నేర్చుకోవడం వల్ల దేశ సమగ్రత సాధ్యపడుతుందన్నారు. అధ్యాపకులు అందరూ హిందీ భాష పట్ల తమకు ఉన్న అభిమానాన్ని అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ద్వితీయ భాషగా హిందీని అభ్యసించే విద్యార్థులచే గోడ పత్రిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. హిందీ భాషలో జ్ఞానపీఠ పురస్కారాలు పొందిన కవుల చిత్రపటాలను ప్రదర్శించి, వారు హిందీ సాహిత్యానికి చేసిన సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులు హిందీలో పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో ఆర్డినేటర్ సుధాకర్, అధ్యాపకులు వై. ప్రవీణ్ కుమార్, వామనమూర్తి, తిరుమల రెడ్డి, శరత్ రెడ్డి, చంద్రశేఖర్, వేణుగోపాల శర్మ, శ్రీనివాస్, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతా స్కూల్లో ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్





తూప్రాన్ గీతా స్కూల్‌లో బుధవారం నిర్వహించిన "సైన్స్ ఎక్స్ పో" విశేషంగా ఆకట్టుకుంది. ప్రాథమిక స్థాయి విద్యార్థులు సృజనాత్మకంగా తయారు చేసిన భిన్న రకాల ప్రాజెక్టులు తల్లిదండ్రులను ఆలోచింపజేశాయి. ఈ ప్రాజెక్టుల్లో సోలార్ సిస్టమ్, పౌష్టికాహారం, కరెన్సీ, కొలతలు, కోణాలతో పాటు తెలుగు, హిందీ భాషలకు సంబంధించిన భాషాంశాలను సైతం విద్యార్థులు స్వయంగా తయారు చేసి తమ ప్రతిభను చాటారు. ప్రాజెక్టులను సందర్శించిన తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కృషిని ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకట కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి.ఉష, డైరెక్టర్, మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్, డైరెక్టర్, మున్సిపల్ కౌన్సిలర్ నారాయణ గుప్త, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు స్వాతంత్ర సమర యోధుడు ఒడ్డే ఓబన్న జయంతి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్ టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్వాతంత్ర సమర యోధుడు ఒడ్డే ఓబన్న జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఒడ్డే ఓబన్న 204వ జయంతిని కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియం లో గురువారం ఉదయం 10:30 గంలకు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని తెలిపారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో చల్మెడ తిరుమల దేవస్థానం

- 400 సంవత్సరాల చరిత్ర గల ఆలయం
- తిరుమల స్వామి ఆలయ కమిటీ రద్దుతో
- చైర్మన్ పదవి కోసం ఆశావాహుల ఎదురుచూపు
- నూతన ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి పాటుపడాలి

నవతెలంగాణ-నిజాంపేట



కోరిన కోరికలు తీర్చే తిరుమలేశుడు స్వయంగా వెలిశాడు అని పూర్వీకులు చెపుతుండేవారు. దాదాపు 400 సంవత్సరాల క్రితం మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులో శ్రీ వెంకటేశ్వర తిరుమల స్వామి వెలిశాడని పూర్వీకులు చెప్పుండేవారు. కోరిన కోరికలు తీర్చే వాడని భక్తుల నమ్మకం. ప్రతి సంవత్సరం మాఘమాస నెలలో ఐదు రోజుల జాతర తిరుమల స్వామి కళ్యాణము అంగరంగ వైభవంగా జరుపుతారు. నిత్యం ధూప దీప నైవేద్యాలు పెట్టడం జరుగుతుంది. ఇక్కడికి ఎక్కడెక్కడి నుంచో దూర ప్రాంతాలు దుబ్బాక , బీబీ పేట, బిక్కనూరు, రామాయంపేట, నార్సింగి, దౌల్తాబాద్, భూం పల్లి, మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. వెంకటేశ్వర స్వామి గుడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, గత ప్రభుత్వాలు ఏమి అభివృద్ధి చేయలేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. గత పాలకుల పాపమే అని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆలయ భూములు దాదాపుగా 282 ఎకరాల వరకు ఉన్నప్పటికీ కొన్ని ఎకరాల భూములను వ్యవసాయానికి లీజుకు ఇవ్వడం జరిగింది. నూతన ప్రభుత్వం ఏర్పడటంతో ఆలయ కమిటీని రద్దు చేయడం జరిగిందని ఈవో మోహన్ రెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ నూతన చైర్మన్‌కు చల్మెడ గ్రామం నుంచి దాదాపు పది మంది ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. నూతన ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనైన తిరుమల స్వామి దేవస్థానం అభివృద్ధి చెందుతుందనే ఆశతో మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి నూతన ప్రభుత్వం కృషి చేయాలి



కటికె మల్లేశం , చల్మెడ గ్రామ వాసి

బీఆర్ఎస్ ప్రభుత్వం దేవాలయాలను అభివృద్ధి చేశామని చెప్పునప్పటికీ ఎక్కడ అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. కేవలం యాదగిరిగుట్టను మాత్రమే అభివృద్ధి చేశారని తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా చల్మెడ గ్రామ తిరుమల స్వామి దేవస్థానం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే అభివృద్ధి కుంటుపడింది. దూర ప్రాంతాల నుంచి భక్తులు అనేక మంది వస్తుంటారని ఇక్కడ సరైన సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయానికి కనీసం సత్రాలు కూడా కట్టలేకపోయారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నాను.

ఆలయ కమిటీ చైర్మన్‌కు తీవ్ర పోటీ



చత్రి మల్లయ్య, చల్మెడ నివాసి

ఆలయ కమిటీ రద్దు కావడంతో నూతన కమిటీకి తీవ్ర పోటీ నెలకొంది. కమిటీ చైర్మన్‌కు నువ్వా నేనా అనే విధంగా పోటీకి వస్తున్నారే తప్ప ఆలయ అభివృద్ధికి ఎవరు పాటుపడడం లేదు. ఈ సారైనా నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆలయం దగ్గర జరిగే జాతరకు వచ్చే భక్తులకు సరియైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాను.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీత రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాదులోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకునేలా ప్రతి ఒక్కరు కష్టపడాలని కేటీఆర్ సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో నాగ్సాన్ పల్లి సర్పంచ్ ఎల్లం, ఎంపిటిసి గుంజరి ప్రవీణ్, శ్రీనాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటర్లో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి





నవ తెలంగాణ-మెదక్ టౌన్

ఇంటర్‌లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను సూచించారు. మెదక్ జిల్లాను ఇంటర్ ఫలితాలలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచాలని ఇంటర్ కళాశాల అధికారులను అదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఇంటర్ కళాశాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సబ్జెక్ట్ కౌన్సిలర్స్ తయారు చేసిన ప్రత్యేక బేసిక్ లర్నింగ్ మెటీరియల్‌ను ఆవిష్కరించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు దగ్గరగా ఉన్నాయన్నారు. మెదక్ జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 6,506 మంది, రెండవ సంవత్సరంలో 6,653 మంది విద్యార్థులు మొత్తం 13,159 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులు, తల్లితండ్రులు, అధ్యాపకులు సమిష్టిగా ఇంటర్‌లో మంచి ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. మెదక్ జిల్లాలో ఉన్న 63 ఇంటర్ కళాశాలలో విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూప్‌గా విభజించాలని సి, డి గ్రూప్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రూపుల వారీగా విద్యార్థులను వాట్సప్ గ్రూప్‌లుగా విభజించి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జనవరి 1వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు స్పెషల్ స్టడీ అవర్స్, స్పెషల్ స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 5 గంటలకు విద్యార్థులను నిద్ర లేపి చదివించాలని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ అందిస్తున్నామన్నారు. పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాలు కోసం ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 31 జనవరి 2024 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, ఎస్సీ అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి, ప్రిన్సిపల్స్, కౌన్సిలర్స్ అవనిశ్ రెడ్డి, శశిధర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీదేవి, కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల అందజేత

నవతెలంగాణ తూప్రాన్ రూరల్ మనోహరాబాద్



మల్కాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తన సొంత ఖర్చులతో బూట్లు, ఐడీకార్డ్, టై, బెల్టు లను అందించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ పేర్కొన్నారు. తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎంఈఓ బుచ్చియా నాయక్, ఎస్సై శివానందం, మండల నోడల్ అధికారి సత్యనారాయణ, ఇస్లాంపూర్ హెచ్ఎం సత్యం, మల్కాపూర్ హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మన్నేమహాదేవి నవీన్ యాదవ్, ఎస్ఎంసి చైర్మన్ స్వామిలు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, ఎస్సై శివానందం,ఎంఈఓ బుచ్చ నాయక్ గ్రామ సర్పంచ్ మన్నేమహాదేవి నవీన్, ఉప సర్పంచ్ అంజనేయులు గౌడ్, గెస్ట్ ఆఫీసర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మధుమోహన్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు మహేందర్ రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ స్వామి, ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు, మేకిన్ యువత పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి జన్మదిన వేడుకలు





నవతెలంగాణ -పాపన్నపేట

మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు జన్మదిన వేడుకలు పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏడుపాయల శ్రీ వన దుర్గమాత సన్నిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వన దుర్గా మాతకు ప్రత్యేక పూజలు, కుంకు మార్చనలు చేసి అయన నిండు నూరేళ్ళ, ఆయురారోగ్యా లతో జీవించాలని, సుఖ సంతోషాలను ప్రసాదించాలని అమ్మవారిని మొక్కుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ కేక్ కట్ చేసి హన్మంతరావుకు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, పార్టీ మండల సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, నాయకులు శ్రీకాంతప్ప, రమేష్ గుప్తా, గౌస్ పాషా, పార్శ నర్సింలు, నర్సింలు గౌడ్, బాబర్ పటేల్, దేవేందర్ రెడ్డి, దండెం దుర్గేష్, జనార్ధన్ రెడ్డి, భరత్ గౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి వద్ద మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు 57వ జన్మదిన వేడుకలను నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ గుడిలో పూజలు చేసి, దవాఖానా లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు మారుతి, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, సత్యనారాయణ రెడ్డి, ఆకుల బాలయ్యలు మాట్లాడుతూ మైనంపల్లి హనుమంత రావు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఎల్లమ్మ తల్లిని కోరుకున్నామన్నారు. ఇలాంటి పుట్టినరోజులు ఇంకా ఎన్నెన్నో నిర్వహించుకోవాలని, మంత్రి పదవి కూడా రావాలని కోరుకున్నామన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగించాలని కోరుకున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎస్ఓ, మండల ఇన్‌చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు అందే స్వామి, మండల సేవాదళ్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మహేందర్ రెడ్డి రవీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్ రాజిరెడ్డి, చల్మేటి నరేందర్ జాల శ్రీకాంత్, జీడి చిన్న అంజాగౌడ్, పంజా బాబు, కాకి రాజయ్య, కన్నాపురం బాగా గౌడ్, నాగరాజు, భూమా గౌడ్, మహేష్, జబ్బర్ రాజు, నస్కల్ వెంకట్, కనకరాజు, మాసుల చంద్రం, సామల రమేష్, పాల్గొన్నారు.



రైతులకు నూజివీడు విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-మర్కుక్



మండలంలో వేద సాగు చేస్తున్న రైతులకు నూజివీడు విత్తన కంపెనీ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధి ద్వారా ఉచితంగా విత్తనాలను పంపిణీ చేయడం హర్షనీయమని మర్కుక్ మండల వ్యవసాయాదికారి డా. టి.నాగేందర్ రెడ్డి అన్నారు. బుధవావరం నూజివీడు విత్తనం కంపెనీ వారు వేదసాగు చేస్తున్న రైతులకు వరి విత్తనాలు, కలుపు నివారణ మందులను 150 ఎకరాలకు మర్కుక్ రైతు వేదికలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఈవో విష్ణు వర్ధన్,తదితరులున్నారు.

నంగునూరులో అయోధ్య అక్షింతల పంపిణీ

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండల కేంద్రంలో బుధవారం అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ నెల 22న జరగనున్న రామ మందిర ప్రారంభోత్సవం దేశ వ్యాప్తంగా కన్నుల పండుగగా జరగనున్న నేపద్యంలో మంగళాహారతులతో స్వాగతం పలికారు. రాముల వారి అక్షింతలను ప్రధాన వీధుల గుండా మంగళ హారతులతో తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ, తాజా ప్రజాప్రతినిధులు, హనుమాన్ యూత్ నాయకులు, వివిధ కుల సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఐదు గ్యారంటీలు అందించాలి

నవతెలంగాణ-గజ్వేల్



కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని మాట ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలని కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నిమ్మరమేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో పది సంవత్సరాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పథకాలు ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఆయన అన్నారు. ఉచిత మహిళలకు బస్సు ప్రయాణం మినహా మిగతా 5 గ్యారంటీలు రెండు నెలల్లో అమలు చేయాలని ఆయన కోరారు. ప్రజా పాలన ఏర్పాటు చేసి తీసుకున్న అర్జీలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. రేషన్ కార్డులు, పెన్షన్స్, రైతు బీమా రైతు బంధు తదితర పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. కొత్త ప్రభుత్వం పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలను నిరాశ పరచవద్దని ఆయన పేర్కొన్నారు.

22న ప్రతి ఇంటిలో 5 దీపాలు వెలిగించాలి

నవతెలంగాణ-గజ్వేల్



ఈ నెల 22న ప్రతి ఇంటిలో 5 దీపాలు వెలిగించి అయోధ్యలో రాముని ప్రతిష్టకు సంఘీభావం తెలపాలని కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రాముని విగ్ర ప్రతిష్టకు పార్టీలకు సంబంధం లేకుండా అందరూ సహకరించి ముందుకు వెళుతున్నారు. ఇందులో భాగంగానే ప్రతి ఇంటికి అయోధ్య అక్షింతలు పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. పవిత్రమైన ఈనెల 22వ రోజున మరో దీపావళి అవతరించబోతుందని ఆయన అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రతి దేవాలయం వద్ద పెద్ద ఎత్తున దీపాలు వెలిగిస్తామని అదేవిధంగా ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించి ప్రతి ఇంటిపై హనుమాన్ జండా ఎత్తాలన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొంటున్నారని ఆయన అన్నారు. ఆర్య వైశ్యులు తోపాటు అన్ని సామాజిక వర్గాలు విధిగా పాల్గొంటున్నయని ఆయన పేర్కొన్నారు.

మైనంపల్లికి దట్టిగట్టిన మైనార్టీ నేత

నవతెలంగాణ-గజ్వేల్



మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన సందర్భంగా గజ్వేల్ మైనార్టీ నేత అస్గర్ దట్టి కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మైనాంపల్లి హనుమంతరావు జన్మదిన సందర్భంగా పలువురు గజ్వేల్ నాయకులు కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీకి కష్టపడి వారికి గుర్తింపు ఇస్తుందన్నారు.

అందని ద్రాక్షలా ఫసల్ బీమా

- రైతులు ఆశగా ఎదురుచూస్తున్న వైనం



నవతెలంగాణ-గజ్వేల్

ఫసల్ బీమా రైతులకు అందరి ద్రాక్షలా మారింది. ఫసల్ బీమా కోసం రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా పసల బీమా ఆగిపోయింది. కొత్త సర్కారుపై పసల్ బీమా రైతులు అమలు కోసం ఎదురుచూస్తున్నారు. వరి, పత్తి, కంది తదితర వంటలకు తప్పని నష్టాలు ఎదురుకుంటున్నారు. పరిహారం అందక రైతుల ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో భాగంగానే సిద్దిపేట జిల్లాలో వానాకాలంలో సుమారు 5.70 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు లోకి వస్తుంటాయి. అందులో భాగంగానే 3.50లక్షల ఎకరాలకుపైగా వరి, 1.20 లక్షల ఎక రాల్లో పత్తి సాగులోకి వస్తుండగా, మిగిలిన విస్తీర్ణం లో ఇతర పంటలు సాగులోకి వస్తాయి. యాసంగి సీజన్లో మరో 3.50లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తుంటాయి. పంట బీమా ఫసల్ బీమా పథకంలో భాగంగా వానాకాలంలో సాగుచేసే ఆహార, నూనె గింజలు, వాణిజ్య, ఉద్యాన పంటలకు పంటలవారీగా, ప్రాంతాలవారీగా ప్రీమియం నిర్దేశించారు. అగ్ని ప్రమాదం. పిడుగుపాటు, గాలివాన, వడగళ్లు, తుఫాను, టోర్నడో, అనావృష్టి, వరదలు, నీట జె మునిగిపోవడం, తెగుళ్లు, ప్రతికూల వాతావ రణం వల్ల దిగుబడులకు నష్టం వాటిల్లితే నష్ట పరిహారం చెల్లిస్తారు. అంతేకాకుండా ప్రతికూల వాతావరణం కారణంగా రైతులు విత్తనాలు వెయ్యకపోవడం,, నార్లు పొయ్యక కపోవడం వల్ల కలిగే ఆర్థిక నష్టాలకు బీమా మొత్తంలో 25 శాతం వరకు సత్వర నష్టపరిహారం అందించే అవకాశం ఈ పథకంలో ఉంది. పంట మధ్యకాలంలో నష్ట పోయిన రైతులకు సైతం నష్టాన్ని అంచనా వేసి పరిహారంలో 25 శాతం చెల్లించే అవకాశముంది. అదే విధంగా పంట కోతల తర్వాత పొలంలో అరబెట్టిన పంటకు 14రోజుల్లోపు తుఫాను, అకాల వర్షాల కారణంగా నష్టం జరిగితే ఆ " నష్టాన్ని అంచనా వేసి షరతులతో కూడిన చెల్లిం పులు జరుగుతున్నాయి.

మొక్కజొన్న ఎకరాకు రూ.25 వేల బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. రైతు అందులో 2 శాతం అంటే రూ.500 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. వరి ఎకరాకు రూ.34 వేల బీమా వర్తించడానికి అవకాశం ఉండగా అందుకోసం 2 శాతం రూ.680 ప్రీమియం చెల్లించాలి. కంది ఎకరాకు రూ.14 వేల బీమా వర్తించే అవకాశం ఉండగా అందులో 2శాతం గా రూ.280 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఎకరా పెసర్లకు రూ.14వేల బీమా అందే అవకాశం ఉండగా 280 ప్రీమియం చెల్లిస్తే ఈ అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అందులో రెండు శాతంగా రూ 300 రూపాయలు ప్రీమియం చెల్లించవలసి ఉంది. పత్తికి ఎకరాకు రూ 1750 ప్రేమమ్ చెల్లించాల్సి ఉండగా బీమా కింద రూపాయలు 35000 వచ్చే అవకాశం ఉంది. రబిలో సైతం ఈ పథకం వర్తిస్తుందని చెప్పాలి. రైతులు తమ ఆధార్ కార్డు పట్టాదార్ పాస్ పుస్తకం బ్యాంకు ఖాతా నెంబర్లతో ఏఈఓ ధ్రువీకరణతో మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా ఈ పథకం నిలిచిపోవడం తో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పథకం అమలయ్యేది. కొన్నేళ్లుగా ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని అధికార వర్గాల సమాచారం. సమస్య ఏదైనా ప్రస్తుతం రైతులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుస్థితి రైతులకు పంట నష్టం జరిగితే ఇక దేవుడే.. దిక్కు అనే పరిస్థితి నెలకొంది. ఇలాంటి ప్రతికూల పరి స్థితుల కారణంగా పంట నష్టానికి గురైన రైతులు పీకలోతు కష్టాల్లో కూరుకుపోతున్నారు. వంటల బీమా పథకం అమలుచేసి ఉంటే ఈ దుస్థితి ఉం డేదా? అని రైతులు వాపోతున్నారు. కొత్త ప్రభు త్వంతో ఈ తీరు మారుతుందోమోనని రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ పథకంపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు ప్రకటనలు వెలువడడం తో ఆశలు చిగురించినట్టయింది.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి
- ఐదు గ్యారంటీల అమలుకు సీఎం కృషి



నవతెలంగాణ- గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పేదలకు న్యాయం జరుగుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక గజ్వేల్ పట్టణంలోనే గత కాంగ్రెస్ ప్రభుత్వం లోనే 2300 మంది నిరుపేదలకు తాను ఇండ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదన్నారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కొనసాగుతుందని పేదలను న్యాయం జరుగుతుందన్నారు. పేదల కోసం ఇందిరమ్మ రాజ్యం ఏర్పడదని ఆయన అన్నారు. డబుల్ బెడ్ రూమ్ విషయంలో అధికారులతో చర్చించి న్యాయం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలో ఐదు గ్యారెంటీలను వెంటనే అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జరుగుతుందన్నారు. అప్పుటి ముఖ్యమంత్రి కెసిఆర్ అనేక హామీలు ఇచ్చారని ఏ ఒక్కడు కూడా నెరవేరలేదన్నారు. సంగాపూర్ సమీపంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రస్తుతం మల్లన్న సాగర్ నిర్వాసితులను అప్పుడు ప్రభుత్వం వారికి నివాసం కల్పించిందన్నారు. ప్లాట్లు వారికి వచ్చే బెనిఫిట్స్ ఏ స్థాయిలో ఉన్నాయో వాటిని పరిశీలించి వారితో చర్చించాలన్నారు. ఆ తర్వాతేడ్రా పద్ధతిలో తీసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించేందుకు చర్చించవలసి వస్తుందన్నారు. అనేక పనులు పెండింగ్లో ఉన్నాయని అధికారులతో దశలవారు చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పెండింగ్ పనులను పూర్తి చేసినందుకు శాశక్తులకు కృషి చేస్తానన్నారు. శాఖల వారీగా గజ్వేల్ లో ఉన్న సమస్యలను ఆయా మంత్రుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుండి తీసుకున్న విజ్ఞప్తుల పై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని వారు పెట్టుకున్న అర్జీలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తుందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న తొమ్మిది మండలాల్లో పెండింగ్లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి పెడతామని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన వైఫల్యాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని ఆయన అన్నారు. పేదలకు న్యాయం చేసేందుకు 100 గదాలు స్థలం ఉన్న ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు తుంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి అధ్యక్షతన నర్సారెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ 2024వ సంవత్సరం క్యాలెండర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మొనాగారి రాజు, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హనుమాండ్ల నాగరాజు నేత, పిసిసి మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ ఇక్బాల్,కుకునూర్ పల్లి మండల అధ్యక్షులు విరుపాక శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్ రావు,యువజన కాంగ్రెస్ మాజీ తలకొక్కుల ప్రేమ్ కుమార్ నేత, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నే కృపానందం, మైనారిటీ జిల్లా కార్యదర్శి మొహమ్మద్ ఫారూఖ్ జాని, సీనియర్ నాయకులు మహంకాళి చంద్రం, పట్టణ ఉపాధ్యక్షులు బాగమ్మొళ్ల మల్లేష్, అడ్వకేట్ ఎన్నేళ్లి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాషాయం హిందువుల గుండెకాయ

నవ తెలంగాణ -గజ్వేల్



అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠలో భాగంగా శ్రీరామకోటి భక్త సమాజం పిలుపు మేరకు బుధవారం స్థానిక కృష్ణాలయ దేవస్థానంవారు కాషాయ జెండాలకు రామాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. కాషాయ జెండాలు పట్టుకొని ప్రతి ఒక్కరు కూడా జై శ్రీరాం నినాదాలు చేయడంతో ఆలయ ప్రాంగణం మారు మ్రోగింది. అనంతరం ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ తీసి కృష్ణాలయ దేవస్థానం వారు భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు మాట్లాడుతూ కాషాయం జెండ పట్టుకున్న వారికి విజయమే తప్ప అపజయమే ఎరగరు అన్నారు. కాషాయం మన గుండెకాయ అన్నారు. కాషాయం విజయానికి నాంది. ప్రతి ఇంటి మీద కాషాయ జెండా ఎగరాలి మనము కళలు కన్నా అయోధ్య రాముని ప్రతిష్ఠ కళ్లారా చూడాలన్నారు. ఆలయ ప్రతినిధులు రామకోటి సంస్థకు జెండాలు అందించారు. కార్యక్రమంలో సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షులు ఆకుల నరేష్ బాబు, కృష్ణాలయం అధ్యక్షులు ఎలగందుల రాంచంద్రం, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, ఉప్పల మధు, దొంతుల దశరథం, ధార రాంచంద్రం, మహంకాళి శ్రీనివాస్, తుమ్మ మల్లేశం, వేములవాడ కనకాచారి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- రేషన్‌కార్డుల వేలిముద్రలు సమయం పొడిగించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గ వ్యాప్తంగా మండలం, మున్సిపల్ కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలను పెంచాలని, రేషన్ కార్డుల వేలిముద్రల గడువు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. రెండు నెలలుగా 10 సంవత్సరాలలోపు పిల్లలకు వేలిముద్రలు కావాలని, చిరునామా మార్చాలని ఆధార్ కేంద్రాల వద్దకు తిరిగినా కాలయాపన చేస్తున్నారని అన్నారు. పరిమితమైన ఆధార్ కేంద్రాలు ఉండడం వలన వేలాది మంది ప్రజలు ఆధార్ కార్డులను పట్టుకొని మున్సిపల్ పోస్ట్ ఆఫీస్ తదితరుల కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని, అయినా సమయం సరిపోవడం లేదని అన్నారు. ఆధార్ కేంద్రాన్ని నిర్వాహకులు రోజు యాభైకి మించి చేయకపోవడం సాఫ్ట్వేర్ సమస్యల తలెత్తడం అనేక కారణాల రీత్యా చాలా మంది ప్రజలు బాల బాలికలు తమ ఆధార్ కార్డును అప్డేట్ చేసుకో లేకపోతున్నారని అన్నారు. వేలిముద్రలు లేకుంటే వచ్చే నెల నుండి బియ్యం అని రేషన్ షాప్ యజమానులు చెప్పడంతో ప్రజలు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ప్రజల సౌకర్యార్థం ప్రతి మండల కేంద్రంలో మున్సిపల్ పట్టణాల్లో మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆధార్ కార్డులను అప్డేట్ చేయాలని రేషన్ కార్డుల వేలిముద్రలు సమయం ఆరు నెలల వరకు పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ మండలంలోని బూరుగుపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, సంపత్, జానకిరామ్ రెడ్డి ఉపాధ్యాయులు బదిలీ అయిన సందర్భంగా బుధవారం వారికి వీడ్కోలు పలికారు. వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. మాజీ తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ వంటేరు విజయవర్ధన్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఓ వ్యవస్థను తిరిగి అమలు చేయాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవ తెలంగాణ- గజ్వేల్

గత ప్రభుత్వం రద్దు చేసిన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను తిరిగి అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో బుధవారం శంకర్ విలేకరులతో మాట్లాడుతూ అవినీతి పేరుతో వీఆర్ఓ వ్యవస్థను రద్దు చేసిన గత ప్రభుత్వం భూ పరిపాలనను విధ్వంసం చేసి పేదలకు భూ హక్కులను నిరాకరించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో భూ వివాదాలు, భూహక్కుల పరిష్కారానికి వీఆర్ఓ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ధరణి అధ్యయనం కోసం కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కమిటీ ప్రజా సంఘాలతో చర్చించాలని, ధరణి బాధితులను కలిసి సమగ్ర నివేదిక సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు పాల్గొన్నారు.

తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతనం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సిద్దిపేట జిల్లాలో తెలంగాణ అగ్రికల్చర్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ ఫోరం మరియు సిద్దిపేట జిల్లా టీఎన్జీవోఎస్ సంఘం సమక్షంలో తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఏ.అశోక్, జనరల్ సెక్రటరీగా ఎన్.సాయి కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కే.విజయ్ కుమార్, ట్రెజరర్‌గా వై.ప్రేమ్ సాయి, వైస్ ప్రెసిడెంట్‌గా డి.మీరా భాయి, 18 మందితో కూడిన కార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డిస్ట్రిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ శివ ప్రసాద్, సిద్దిపేట జిల్లా టీ ఎన్జీవోఎస్ అధ్యక్షులు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీవిద్యాధరి క్షేత్రంలో మూలనక్షత్ర విశేష పూజలు



నవతెలంగాణ వర్గల్

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో బుధవారం మూల నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, చండీ హెూమం, లక్ష నామార్చన, లక్ష పుష్పార్చన తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మూల మహెూత్సవానికి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేయగా, శ్రీ విద్యాధరి, శ్రీ శనీశ్వర, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి, శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు భక్తులతో కిటకిట లాడాయి. దీంతో ఆలయాల సముదాయం అమ్మవారి నామస్మరణతో మార్మోగుతూ ఆధ్యాత్మికత వెల్లువిరిసింది.

వాసవీక్లబ్ నేత్రాల సేకరణ

నవ తెలంగాణ - సిద్దిపేట



వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నాయకులు కోర్తివాడ రాజేందర్ తండ్రి, రిటైర్డ్ ఉపాధ్యాయులు కోర్తివాడ శేఖరం మరణించారు. ఆయన కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను సేకరించామని, సేకరించిన నేత్రలను ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంక్ వారికి పంపించామని వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిన వారమవుతారని, ఎవరైనా మరణించినచో వారి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి నేత్రదానం చేయాలని కోరారు. నేత్రదానం చేసిన శేఖరం కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్బు ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణమూర్తి, నేతి వేణు కుమార్, రీజియన్ చైర్మన్ మంకాల శ్రీనివాస్ ,జోన్ చైర్మన్ చింత రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడు చకలం రవి, యూత్ క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి హరి కిరణ్, పూర్వ అధ్యక్షుడు లింగ శ్రీనివాస్, జైన సత్యం, యాద శ్రీనివాస్, పుల్లూరి శివకుమార్, పుల్లూరి శశాంక్, శివ్వ శ్రీనివాస్,సోమ శివకుమార్, సోమ వనజ, అయిత పురుషోత్తం, సభ్యులు మర్యాల వీరేశం, చందా వేణుగోపాల్, బచ్చు రమేష్, అలయన్స్ క్లబ్ నాయకులు బెజగం ఆత్మరాములు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 11 జనవరి 2024 | www.navatelangana.com

నంగునూరులో అయోధ్య అక్షింతల పంపిణీ

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండల కేంద్రంలో బుధవారం అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 22న జరగనున్న రామ మందిర ప్రారంభోత్సవం దేశ వ్యాప్తంగా కన్నుల పండుగగా జరగనున్న నేపథ్యంలో మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రధాన వీధుల గుండా మంగళ హారతులతో తిరుగుతూ రాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ, తాజా ప్రజాప్రతినిధులు, హనుమాన్ యూత్ నాయకులు, వివిధ కుల సంఘాల, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ యూత్ నూతన కమిటీ కార్యవర్గం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండల కేంద్రంలో బుధవారం ముదిరాజ్ యూత్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొండిల్ల రాజు, ఉపాధ్యక్షులుగా చింతల నవీన్, కోశాధికారిగా గుండబోయిన సాయిరాంను సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. బీసీ డీ గ్రూపు నుంచి ఏ గ్రూపులోనికి మార్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్, మత్స్య సహకార సంఘ సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ ఆఫీస్‌లో ధూమపానం

- ఇర్కోడ్ పోస్ట్ ఆఫీస్‌లో ధూమపానం చేస్తున్న ఎస్‌పి ఎం
- అవస్థలు పడుతున్న వినియోగదారులు
- ప్రభుత్వ అధికారే ధూమపానం చేయడం చట్ట విరుద్ధం
- చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆగ్రహం

నవతెలంగాణ-సిద్దిపేట రూరల్

పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో సిగరెట్ ధూమపానం చేయడం ఏంటని ఆలోచిస్తున్నారా ఇది వాస్తవమే సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ పి ఎం కమలాకర్ డ్యూటీ టైంలో నేరుగా సిగరెట్ తాగుతూ విధులు నిర్వహించడంపై పోస్ట్ ఆఫీస్ చెందిన వినియోగదారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రోజువారీగా పోస్ట్ ఆఫీస్ కార్యానికి వస్తున్న ఎస్‌పి ఎం కమలాకర్ విధులు నిర్వహించే సమయంలో కార్యాలయంలో ఉంటూనే ధూమపానం తాగుతున్నాడు. దీంతో కార్యాలయం అంతా ధూమపానం వాసనతో నిండిపోవడంతో కార్యాలయానికి వెళ్లే ఖాతాదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన అధికారి ఇలా ఇష్ట రీతిగా ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించడం ఏంటని కార్యాలానికి వచ్చేవారు మాట్లాడుకుంటున్నారు.

ప్రభుత్వ అధికారి అంటే మంచి లక్షణం గుణం కలిగి, చెడు అలవాట్లకు దూరంగా ఉంటారని ప్రజలకు విశ్వాసం. కానీ ఎస్ పి ఎం కమలాకర్ వీటికి విరుద్ధంగా వ్యవహరిస్తూ దర్జాగా కుర్చీలో కూర్చొని సిగరెట్ కాల్చుతూ విధులు





నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు జన సంచార స్థలాలలో వాళ్ల పోస్టులతో వాటిని పొగ తాగడం మద్యం సేవించడం హానికరమని సూచనలు చేస్తుంది. అన్ని తెలిసినా ప్రభుత్వ అధికారి కార్యాలయంలో సిగరెట్ తాగడం ఏంటని ప్రజలు అవాక్కైతున్నారు

ఈ విషయంపై ఎస్పీఎం కమలాకర్‌ను వివరణ కోరగా ఇది చిన్న విషయమని దీని ఎందుకు భూతాద్దంతో పెట్టి చూస్తున్నారని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధికారిపై చర్యలు తీసుకోవాలని ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ముగ్గుల పోటీలో మొదటి బహుమతి



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన ఓజ్జల రమాదేవి కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సాధించినట్లు జనగామ పాలకేంద్రం అధ్యక్షులు మట్ట ఆదిరెడ్డి, సూపర్వైజర్ బండారి వీరస్వామి తెలియజేశారు. జిల్లాస్థాయిలో గ్రామానికి పేరు తీసుకువచ్చిన ఆమెను అభినందించారు.

పుల్కల్ ఎస్సైకి సన్మానం



నవతెలంగాణ-పుల్కల్

ఇటీవల పుల్కల్ ఉమ్మడి మండలానికి కొత్తగా వచ్చిన ఎస్సై క్రాంతికుమార్‌ను దళిత సంఘం నాయకులు బుధవారం శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి సమస్య ఉన్నా తనను నేరుగా కలవాలని తెలిపారు. దళిత సంఘాల నాయకులు ఈ సోజీపేట రవికుమార్ ఆయా గ్రామాల దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలకు సోరుపాక ఎంపిక

నవతెలంగాణ-బెజ్జంకి



ఈ నెల 12 నుండి 16 వరకు మహారాష్ట్రంలోని నాసిక్ యందు జరుగనున్న జాతీయ యువజనోత్సవాలకు మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామానికి చెందిన సోరుపాక అనిల్ ఎంపికైనట్టు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. జాతీయ యువజనోత్సవాలకు సోరుపాక అనిల్ ఎంపికవ్వడంపై మండల యువజన సంఘాల సభ్యులు, పలువురు దేవక్కపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం అంతకపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ సహకారం.. 1985-86 ఎస్ఎస్‌ఎస్సి బ్యాచ్ సౌజన్యంతో 70 మంది బాలికలకు సైకిళ్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మకొండ రోటరీ క్లబ్ అధ్యక్షుడు రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం తమ క్లబ్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ సంవత్సరం నాలుగు వందల మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశామన్నారు. ఫర్నిచర్, రాత పుస్తకాలు, వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయడంతో పాటు చదువులో ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించామన్నారు. ఎస్ఎస్ సి బ్యాచ్ కన్వీనర్ జనగామ పాపారావు మాట్లాడుతూ సైకిళ్ల కయ్యే ఖర్చులో రోటరీ క్లబ్ 85% భరించగా విద్యార్థుల కంట్రిబ్యూషన్ గా మిగతా 15 శాతాన్ని తాము అందించామన్నారు. సైకిళ్లను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ కాయిత ఇంద్రసేనారెడ్డి, సర్పంచులు ఇర్రి లావణ్య రాజిరెడ్డి, ముత్యాల సంజీవరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కంది రజిత, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఎంఈఓ నరసింహారెడ్డి, కరీంనగర్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అశోక్ రెడ్డి, రైల్వే ఇంజనీర్ పద్మనాభం, రైల్వే యూనియన్ నాయకులు యాదవ రెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు జయశ్రీ, శ్రీదేవి, ఉప సర్పంచ్ సమ్మయ్య, ఎస్ఎంసి చైర్మన్ కాశ బోయిన రజిత పాల్గొన్నారు.

ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీని కలిసిన గూడూరి శ్రీనివాస్

నవతెలంగాణ - సిద్దిపేట



గాంధీభవన్‌లో ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని టీపీసీసీ చేనేత సెల్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం ఏదైనా పథకాన్ని రూపొందించి, ఆదుకోవాలని కోరారు.

మండల కేంద్రంలో టీహెచ్ఆర్ క్రికెట్ ట్రోఫీ ప్రారంభం

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో బుధవారం ఎన్సీసీటీం, టీహెచ్ఆర్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసే ఉదేశ్యంతో నిర్వహిస్తున్న, టీహెచ్ఆర్ క్రికెట్ ట్రోఫిని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి చేతుల మీదుగా టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ ఆటల్లో గెలుపు, ఓటములను స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎంఎల్ఏ తన్నీరు హరీష్ రావు గత 20 సంవత్సరాల నుంచి ఇక్కడి క్రీడాకారుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కృషి ఫలితంగానే క్రీడారంగాల్లో సిద్దిపేట నియోజకవర్గం రాష్ట్రంలో చాలా ముందడుగు వేసిందని గుర్తు చేశారు. టోర్నమెంట్ నిర్వహిస్తున్న ఆర్గనైజేషర్స్‌కు తరలి వచ్చిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపి మొదటి మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. ఈ



కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు యం.డి. రహీమ్ పాషా, ఉపసర్పంచ్ దాసరి చంద్రకళ రవి, తుమ్మకోలు మహేందర్ రెడ్డి, చెలికాని యాదగిరి, రంగు రాజు, ఆకుబత్తిని రాము, రేకులపల్లి వెంకట్ రెడ్డి, రచ్చ సిద్దు, కొండిల్ల రాజు, పాపిగారి నరేష్, శ్రీధర్ గౌడ్, పల్లపు రాజు, అల్లెపు పర్శరాములు, కందికట్ల పర్శరాములు, గోనేపల్లి శివ, అనరాజు రాజు, టోర్నమెంట్ ఆర్గనైజర్లు కోల శ్రావణ్ గౌడ్, గిరి బాబు, పవన్ రెడ్డి, నవీద్, రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నవ తెలంగాణ- రాయపోల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షులు తుడుం శివలింగం అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రం ప్రజా పరిషత్ కార్యాలయంలో యూటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను ఎంపీడీవో మున్నయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, మొదటి తారీఖున వేతనాలు చెల్లించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, ఫర్నిచర్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలాగే సంవత్సరాల తరబడి పేరుకుపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని,బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని,



ఉపాధ్యాయలు, సిబ్బంది ఖాళీలను గుర్తించి పూర్తిస్థాయి ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు.ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తున్న ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనారాయణ,సీనియర్ అసిస్టెంట్ ముత్తాలిఫ్, యుటిఎఫ్ రాయపోల్ మండల ఉపాధ్యక్షులు బి. రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి సూరం నరసింహ, నాయకులు కనకరాజు, కరుణాకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెట్రో పొడిగింపు కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం

నవతెలంగాణ - పటాన్ చెరు

మియాపూర్ నుండి పటాన్ చెరు వరకు మెట్రో పొడిగింపు కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, ఐఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు కొల్కూరి నర్సింహరెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం 30 రోజుల పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ 30 రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పదం తో దూసుకుపోతున్న డైనమిక్ యంగ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు దామోదర్ రాజనర్సింహ కొండా సురేఖ, మాజీ మంత్రులు గీతారెడ్డి, ఏ చంద్రశేఖర్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి డిసిసి అధ్యక్షురాలు నిర్మల జయప్రకాశ్ రెడ్డి, ఇంచార్జీ కాటా శ్రీనివాస్ గౌడ్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం తో పాటు ఆరు గ్యారెంటీ పథకా లు అమలు కోసం కమిటీ, నూతన పరిశ్రమలు గోద్రెజ్ కోకోకోలా, బిల్ట్, ఆదని గ్రూపు, హీరో స్పేస్ ఇలా అనేక పరిశ్రమలు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అన్నారు 9 యేండ్ల టిఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలు నిరుపేదలుగా మారారని దానికి నిదర్శనమే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోటి 25 లక్షల మంది ఆరు గ్యారంటీల పథకంపై దరఖాస్తులు రావడమే



ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కార్యదర్శి చిన్నా ముదిరాజ్, కార్యదర్శి సామయ్య, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, న్యాయవాది ఐఎన్టియుసి అడ్వైజర్ రామారావు, నాయక ులు పాషా హమీద్, కుంచల కిషన్, రాజు, కమల్, శ్రీనివాస్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై పోలీసుల దాడులు

నవ తెలంగాణ - పటాన్ చెరు

గీతం ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలలో అక్రమంగా నడుపుతున్న బెల్ట్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి మండలంలోని రుద్రారం గీతం ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా బెల్ట్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంట్రర్ల పై జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పలు సెంటర్ల నిర్వాహకులను అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వివిధ రకాల అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు గాను, ఏర్పాటు చేసిన టాస్కోర్స్ పోలీసు బృందాలు గీతం ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలలో నడుపుతున్నఅక్రమ బెల్ట్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు శివయ్య ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, జై భవాని ఫాస్ట్ ఫుడ్ సెంటర్, తూర్పాటి సత్తయ్య కిరణా దుకాణాం, వడ్డె గోపాల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, హరీష్ కిరణాల దుకాణం, రాజు కిరాణం దుకాణం, మల్లేష్ గౌడ్ కిరాణా దుకాణాలపై దాడులు నిర్వహించి ఏ-1 వెల్ల శివయ్య, ఏ-2 ఏదులకంటి లక్ష్మీనారాయణ, ఏ-3 తూర్పాటి సత్తయ్య, ఏ-4 వడ్డె గోపాల్ ఏ-5 అంతప్పగూడెం హరీష్ ఏ-6 కలివేముల రాజు ఏ-7 మల్లేష్ గౌడ్ లను అదుపులోకి తీసుకున్నారు. వివిధరకాల నిషేధిత సిగరెట్లు, వైన్ బాటిల్స్ 180 ఎం ఎల్ -19, విస్కీ 90 ఎం ఎల్ -4 సీజ్ చేశారు. ఏ1- ఏ7 లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్ మాట్లాడుతూ యువత ఎవ్వరూ కూడా చెడు వ్యాసనాలకు భానిసలు కాకూడదని, తల్లిదండ్రులు తమ భవిష్యత్తుపై ఎన్నో ఆశలను పెట్టుకుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచిగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. యువత చెడు వ్యాసనాలకు భానిసలైతే చట్టప్రకారం కఠిన చార్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల వ్యవహార శైలిని కనిపెడుతు ఉండాలన్నారు.

ఇంటింటికి అయోధ్య అక్షింతలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో అయోధ్య ప్రాణ ప్రతిష్ట పూజిత అక్షింతల ఊరేగింపు మహోత్సవాన్ని సర్పంచ్ టేకు తిరుపతి బుధవారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం మంగళవాద్యాలతో అయోధ్య అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు.వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన బొమ్మని బిక్షపతి (60) మంగళవారం మృతి చెందాడు. బుధవారం మర్కుక్ జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం చేబర్తి ఉపసర్పంచ్ గుర్రాల స్వామి,మాజీ ఆత్మ కమిటి డైరెక్టర్ బబ్బూరి రాములు గౌడ్,కాంగ్రెస్ మర్కుక్ మండల ఉపాధ్యాక్షులు ర్యాకం యాదగిరి, పోయిల బాలస్వామి లు పారామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు జాలని బాలనర్సయ్య, బోమ్మనిసత్తయ్యకిష్టయ్య, కృష్ణ, తదితరులున్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ-మద్దూరు

ఈ నెల 11న మద్దూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మద్దూరు దూల్మిట్ట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మేక సంతోష్ కుమార్, మంద యాదగిరిలు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం లో నిర్వహించే ముఖ్య కార్యకర్తల సమావేశానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజే శ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ సమా వేశానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాజీ జెడ్పీటీసీకి మాతృవియోగం

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు తల్లి లక్ష్మీ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి వేరువేరుగా మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చేర్యాల ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యద ర్శులు మొహమ్మద్ సలీం, బిజ్జ రాములు ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు కొమ్ము లక్ష్మీ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నవతెలంగాణ-మద్దూరు

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో డివిజన్ స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, తో కలిసి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం గాగిలాపూర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి క్రీడలను నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు స్నేహభావంతో క్రీడలు ఆడాలని ఆయన కోరారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేక మాధవి గోపాల్, చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేక ఉమామహేశ్వర్, గాగిల్లాపూర్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపొందించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులపే ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఓటర్ జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం వారీగా వచ్చిన ఆయా ఫారాలు, డిస్పోజ్ చేసినవి తదితరాలను సమీక్షించారు. ఈ నెల 20, 21వ తేదీలలో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డి ఆర్ ఓ నగేష్,ఐదు నియోజక వర్గాల ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రభుత్వ భూములు, చెరువులు నీటి వనరుల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరెట్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి రెవెన్యూ, నీటిపారుదల, అటవీ, మత్స్య, వ్యవసాయ, హెచ్ఎండిఏ, షుగర్ కేన్ తదితర శాఖల అధికారులతో జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా అధికారులతో ఆయా సమస్యలపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు,కుంటలు,నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని, కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టల్స్ కు ఒక్కో హాస్టల్ కు ఒక్కో జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని, విద్యార్థులకు ఎలాంటి సైకాలజికల్ ప్రాబ్లమ్స్ ఉన్నా పరిష్కరించేలా, వారి చదువు విషయంలోనూ శ్రద్ధ తీసుకొని పర్యవే క్షించేలా చర్యలు తీసుకోవాలని,అదే విధంగా టీచర్ల తో కౌన్సిలింగ్ మెకానిజం ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ, ఆర్డీవోలు పాల్గొన్నారు.